ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 67 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 13 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :67 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 13 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## 2029 నాటికి ప్రతి పేదవాడికి
# సొంతిల్లు
### అన్నమయ్య జిల్లా రాయచోటిలో 'ప్రజావేదిక' కార్యక్రమం

- గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు: సీఎం చంద్రబాబు
- 2029 నాటికి పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని వెల్లడి
- గృహ నిర్మాణానికి ముస్లింలకు రూ.50 వేల అదనపు సాయం ప్రకటన
- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.900 కోట్ల బిల్లులను చెల్లిస్తామని హామీ
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుతో మహిళలకు ప్రోత్సాహం
- ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా మరో 5.9 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు
- ఇంటింటికీ సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ అందిస్తామన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో 2029 నాటికి ఇల్లు లేని నిరుపేద అనేవారే ఉండకూడదని, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక గౌరవం, భద్రత, భవిష్యత్తుకు చిరునామా అని ఆయన అభివర్ణించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో బుధవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించిన అనంతరం ఏర్పాటు చేసిన ఈ సభలో ఆయన కీలక ప్రకటనలు చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోగా, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు పక్కా ఇళ్లు కట్టించలేదు. గుడిసెలు గాలొస్తే కొట్టుకుపోయేవి. కానీ పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలని ఆలోచించిన మహానుభావుడు ఎన్టీఆర్. కూడు, గూడు, గుడ్డ నినాదంతోనే టీడీపీ పుట్టింది. మేం 2014-19 మధ్య 8 లక్షల ఇళ్లు కట్టిస్తే, గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4.73 లక్షల ఇళ్లను రద్దు చేసింది. సొంతంగా ఇల్లు కట్టుకున్న 2.73 లక్షల మందికి ఇవ్వాల్సిన రూ.900 కోట్లు ఎగ్గొట్టారు. ఆ బకాయిలను మా ప్రభుత్వం చెల్లిస్తుంది" అని హామీ ఇచ్చారు.
పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు తాము ఇస్తే, గత పాలకులు పట్టణాల్లో సెంటు,

వివరాలు 2లో..

# యువత కలల సాకారం కోసం కృషి చేయాలి



- అమీర్‌పేట కోచింగ్ సెంటర్లు 3 నెలల శిక్షణతోనే అవకాశాలు కల్పిస్తున్నాయి: మంత్రి నారా లోకేశ్
- అమరావతిలో 'హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ - 2025'
- ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్
- భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యమని వెల్లడి
- ఉన్నత విద్యారంగంలో సంస్కరణలు అత్యవసరని ఉద్ఘాటన
- నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు స్కిల్ సెన్సస్

**పెన్ పవర్ డెస్క్:**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో భారతదేశం త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, అయితే మన అసలైన లక్ష్యం దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమేనని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ బృహత్తర లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలంటే ఉన్నత విద్యారంగంలో సమూలమైన సంస్కరణలు తీసుకురావడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో సీఐఐ సదరన్ రీజియన్, విట్-ఏపీ సంయుక్తంగా నిర్వహించిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ %-% 2025'కు లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక

వివరాలు 2లో..

## ఢిల్లీ పేలుడు వెనుక ఆరుగురు డాక్టర్లు..
# ఈ ఘటనలోనూ హైదరాబాదీ లింకు!



- ఢిల్లీ ఎర్రకోట వద్ద బాంబు పేలుడు
- వెలుగులోకి వచ్చిన వైట్-కాలర్ ఉగ్రవాద ముఠా
- నిందితుల్లో ఆరుగురు డాక్టర్లు, ఇద్దరు మత గురువులు
- వివిధ రాష్ట్రాల్లో 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం
- కేసును దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ NIA
- గణతంత్ర దినోత్సవం నాడే దాడికి మొదట ప్లాన్

వివరాలు 2లో..

## గుంటూరులో ఉద్రిక్తత... పోలీసులతో
# అంబటి రాంబాబు వాగ్వాదం



- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరిస్తున్నా రంటూ వైసీపీ ఆందోళనలు
- గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ర్యాలీకి అడ్డంకి
- అంబటి, పట్టాభిపురం సీఐ మధ్య తీవ్ర వాగ్వాదం
- సీఐ తీరుపై మండిపడిన అంబటి.. లోకేశ్ బంధువంటూ ఆరోపణ
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం

వివరాలు 2లో..

# తప్పు చేశాను.. ఇకపై చేయను..



- ఆ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నారు... ఈ విషయంలో చేసిన తప్పుకు క్షమించండి: ప్రకాశ్ రాజ్
- బెట్టింగ్ యాప్‌ల కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరైన ప్రకాశ్ రాజ్
- 2016లో తాను ప్రమోట్ చేశానని, ఆ తర్వాత దానిని రద్దు చేసుకున్నానని వెల్లడి
- తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పుతప్పే అన్న ప్రకాశ్ రాజ్

వివరాలు 2లో..

# దేశంలోని ఆరు ఎయిర్ పోర్టులకు బాంబు బెదిరింపులు.. రంగంలోకి బాంబు స్క్వాడ్స్

- ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపు.. మెయిల్ పంపిన దుండగులు
- ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న విమానాశ్రయాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు
- విమానాశ్రయ అధికారులను అలర్ట్ చేసిన అధికారులు
- విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించిన అధికారులు




**పెన్ పవర్ డెస్క్:**ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాల యానికి గుర్తు తెలియని

వివరాలు 2లో..

## ఉగ్రవాదం మన ఆత్మస్థైర్యాన్ని
# దెబ్బతీయలేదు..
### ఢిల్లీ పేలుడుపై ఇజ్రాయెల్ ప్రధాని వ్యాఖ్యలు

- ఢిల్లీ కారు పేలుడు ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందన
- ఉగ్రవాదం మన స్థైర్యాన్ని దెబ్బతీయలేదని వ్యాఖ్య
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతు ప్రకటించిన ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకో ట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



వివరాలు 2లో..

## డబ్బు కోసమే చంద్రబాబు కుట్ర..
# మెడికల్ కాలేజీల భూములు రూ.100కే అమ్మకం



- సీఎం చంద్రబాబుపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్ర ఆరోపణలు
- లక్షల కోట్ల విలువైన మెడికల్ కాలేజీ భూములను కట్టబెడుతున్నారని విమర్శ
- పుంగనూరులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ
- ప్రైవేటీకరణతో 2150 మెడికల్ సీట్లు కోల్పోతామని ఆవేదన
- డబ్బు ఆశతోనే చంద్రబాబు కుటుంబం కుట్ర చేస్తోందని ఆరోపణ

వివరాలు 2లో..

# నేడు ఉదయం 9 గంటలకు ఒక బిగ్ న్యూస్ వింటారు

- 2019లో ప్రాజెక్టులు నిలిపేసిన ఓ కంపెనీ ఏపీకి తిరిగొస్తోందన్న మంత్రి నారా లోకేశ్
- 'ఎక్స్' వేదికగా వెల్లడి
- ఆ సంస్థ తుపానులా ఆ సంస్థ రాష్ట్రంలోకి అడుగుపెట్టనుందని వ్యాఖ్య
- #InvestInAP హ్యాష్‌ట్యాగ్‌తో పోస్ట్ చేయడంతో పెరిగిన ఆసక్తి
- ఆ కంపెనీ ఏదనే దానిపై సర్వత్రా ఉత్కంఠ



వివరాలు 2లో..

# మోదీ డిగ్రీ వివరాలపై స్పందించండి... ఢిల్లీ వర్సిటీకి హైకోర్టు నోటీసులు




వివరాలు 2లో..

- అభ్యంతరాలు చెప్పేందుకు వర్సిటీకి 3 వారాల గడువు
- సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లు
- పిటిషనర్లలో ఆప్ నేత సంజయ్ సింగ్, ఆర్టీఐ కార్యకర్త నీరజ్

## భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ...
# ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ

- భూటాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ప్రధాని మోదీ
- ఢిల్లీలోని లోక్ నాయక్ జైప్రకాశ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడిన వైనం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**పెన్ పవర్ డెస్క్:**భూటాన్ పర్యటన ముగించుకుని నేడు దేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీలోని

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## ఢిల్లీ పేలుడు వెనుక ఆరుగురు డాక్టర్లు..
## ఈ ఘటనలోనూ హైదరాబాదీ లింకు!

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో జరిగిన అత్యంత తీవ్రత కలిగిన బాంబు పేలుడు దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ దాడి వెనుక డాక్టర్లు, మత గురువులు, ఇతర నిపుణులతో కూడిన ఒక 'వైట్-కాలర్ ఉగ్రవాద ముఠా' ఉన్నట్లు దర్యాప్తులో తేలడం సంచలనంగా మారింది. జైష్-ఇ-మొహమ్మద్ (%జీవవీ%), అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (%ూా+బ౦%) వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థలతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా, ఈ పేలుడు వెనుక ఉన్న డాక్టర్లలో ఒకరు హైదరాబాద్ కు చెందిన వారు కావడం గమనార్హం. గతంలోనూ అనేక ఉగ్రదాడులకు హైదరాబాదీ లింకులు బట్టబయలయ్యాయి. జమ్మూ కాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ పోలీసులు కేంద్ర ఏజెన్సీలతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఈ నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఈ కేసులో భాగంగా ఏడుగురిని అరెస్టు చేశారు. వీరిలో హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉన్న అల్-ఫలాహ్ యూనివర్సిటీకి చెందిన వైద్యులు కూడా ఉన్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిపిన సోదాల్లో 2,900 కిలోలకు పైగా పేలుడు పదార్థాలు, తుపాకులు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు తీవ్రత దృష్ట్యా జాతీయ దర్యాప్తు సంస్థ (%చీఖూ%) దర్యాప్తును చేపట్టింది. ఈ ముఠా సభ్యులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్ల ద్వారా ఒకరితో ఒకరు సంప్రదింపులు జరిపినట్లు, పేలుడు పదార్థాలను రహస్యంగా రవాణా చేసినట్లు తేలింది. అల్-ఫలాహ్ యూనివర్సిటీలో 52 మంది విద్యార్థులు, సిబ్బందిని ప్రశ్నించిన తర్వాత కీలక సమాచారం లభించింది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్నట్లు నిందితుల ఫోన్లలో లభించిన నంబర్ల ద్వారా అధికారులు అనుమానిస్తున్నారు.

**పేలుడు ఘటన వివరాలు**

ఎర్రకోట వద్ద జరిగిన పేలుడుకు అమ్మోనియం నైట్రేట్ ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (%ఖీూ%) నివేదికలో వెల్లడైంది. డాక్టర్ ఉమర్ ఉన్ నబీ అనే వ్యక్తి ఐ20 కారును నడుపుతూ ఈ దాడికి పాల్పడినట్లు, పేలుడు సమయంలో అతను కారులోనే ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఈ కేసులోని ఆరుగురు డాక్టర్ల వివరాలు**

1. డాక్టర్ ముజమ్మిల్ గనై (35, పుల్వామా): ఈ కేసులో కీలక నిందితుడు. అల్-ఫలాహ్ యూనివర్సిటీలో డాక్టర్‌గా, ఎంబీబీఎస్ విద్యార్థులకు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఇతని అద్దె ఇంటి నుంచి 358 కిలోల అమ్మోనియం నైట్రేట్, క్రింకోవ్ అసాల్ట్ రైఫిల్, 91 తూటాలు, పిస్టల్, రిమోట్ కంట్రోల్స్ స్వాధీనం చేసుకున్నారు. జనవరి 26నే దాడి చేయాలని ప్లాన్ చేసి, రెక్కీ కూడా నిర్వహించాడు.
2. డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్ (కుల్గాం): ముజమ్మిల్, ఉమర్‌లకు అత్యంత సన్నిహితుడు. ఇతడిని ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్‌లో అరెస్టు చేశారు. శ్రీనగర్ జీఎంసీలోని తన లాకర్ నుంచి ఏకే-47 రైఫిల్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలను రవాణా చేయడంలో, దాచిపెట్టడంలో ఇతనిది కీలక పాత్ర.
3. డాక్టర్ ఉమర్ ఉన్ నబీ (పుల్వామా): పేలుడుకు ఉపయోగించిన ఐ20 కారును నడిపింది ఇతనే. దాడిని ప్రత్యక్షంగా అమలు చేశాడు. ముజమ్మిల్, అదీల్‌తో కలిసి లాజిస్టిక్స్ సమన్వయం చేశాడు.
4. డాక్టర్ షాహీన్ సయీద్ (లక్నో): ముజమ్మిల్‌కు సన్నిహితురాలు. ఫరీదాబాద్‌లోని కారు నుంచి అసాల్ట్ రైఫిల్‌ను శ్రీనగర్‌కు తరలించింది. కమ్యూనికేషన్, రసాయనాల సేకరణలో పాలుపంచుకుంది.
5. డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ (హైదరాబాద్): చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. రాజేంద్రనగర్‌లో షవర్మా వ్యాపారం చేస్తున్నాడు. ఇతడిని గుజరాత్ ఏటీఎస్ నవంబర్ 8న అరెస్టు చేసింది. టెలిగ్రామ్ ద్వారా ఉగ్రవాదం వైపు ఆకర్షితుడయ్యాడు. రెండు గ్లాక్ పిస్టల్స్, ఒక బెరెట్టా, 4 కిలోల రిసిన్ విషం తయారీకి వాడే పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.
6. డాక్టర్ సజాద్ మాలిక్ (పుల్వామా): ఉమర్‌కు స్నేహితుడు. ఈ కేసులో ఇతడి పాత్రపై ఆరా తీసేందుకు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇతర నిందితులు

షోపియాన్‌కు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ యువ డాక్టర్లను ఉగ్రవాదం వైపు మళ్లించగా, మేవాత్‌కు చెందిన మౌల్వీ హాఫీజ్ మహ్మద్ ఇష్తియాక్ తన ఇంటిలో 2,500 కిలోల పేలుడు పదార్థాలను దాచినట్లు అధికారులు గుర్తించారు. విద్యావంతులను లక్ష్యంగా చేసుకుని, విద్యా సంస్థలను రిక్రూట్‌మెంట్ కేంద్రాలుగా మార్చుకుని ఈ ముఠా దేశ భద్రతకు పెను ముప్పుగా పరిణమించింది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఉదయం 9 గంటలకు ఒక బిగ్ న్యూస్ వింటారు

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వం, మరో కీలక ప్రకటనకు సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఐదేళ్ల క్రితం రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన ఓ ప్రముఖ కంపెనీ తిరిగి రాబోతోందని ఆయన ప్రకటించారు.

"2019లో కొత్త ప్రాజెక్టులను నిలిపివేసిన ఒక కంపెనీ, రేపు తుపానులా ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వస్తోంది. పూర్తి వివరాల కోసం ఉదయం 9 గంటలకు వేచి ఉండండి!!" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. 'బిగ్ అన్ వీల్' అంటూ చేసిన ఈ పోస్టుకు చ%×అజవర్×అూా, చజప్త్రశీశింమాజూవవసజప్త్రశీశింహూా% అనే హ్యాష్‌ట్యాగ్‌లను జతచేశారు. రాష్ట్రంలో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తూ, పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ హ్యాష్‌ట్యాగ్‌లు ప్రతిబింబిస్తున్నాయి. కాగా, 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పలు కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేయడం లేదా ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లడం జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆగిపోయిన ప్రాజెక్టులను పునఃప్రారంభించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో, లోకేశ్ ప్రకటించిన ఆ సంస్థ ఏది? ఎంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టబోతోంది? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే రేపు (గురువారం) ఉదయం 9 గంటల వరకు వేచి చూడాల్సిందే.

## మోదీ డిగ్రీ వివరాలపై స్పందించండి...
## ఢిల్లీ వర్సిటీకి హైకోర్టు నోటీసులు

ప్రధాని నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీ వివరాలకు సంబంధించిన వివాదంలో ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో దాఖలైన అభ్యర్థనలపై తమ స్పందన, అభ్యంతరాలను తెలియజేసేందుకు ఢిల్లీ యూనివర్సిటీకి మూడు వారాల సమయం ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి దేవేందర్ కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఇచ్చిన ఉత్తర్వులను గత ఆగస్టులో సింగిల్ జడ్జి కొట్టివేశారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ ఆర్టీఐ కార్యకర్త నీరజ్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, న్యాయవాది మొహమ్మద్ ఇర్షద్ సహా పలువురు నాలుగు వేర్వేరు అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది.

గత ఆగస్టు 25న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో, ప్రధాని ప్రజా జీవితంలో ఉన్నందున ఆయన వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఉంటుందని, సమాచారంతో సంచలనం సృష్టించడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పునే పిటిషనర్లు ప్రస్తుతం డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేశారు. వాస్తవానికి, ఆర్టీఐ కార్యకర్త నీరజ్ దరఖాస్తు మేరకు, 1978లో బీఏ ఉత్తీర్ణులైన విద్యార్థుల రికార్డులను పరిశీలించాలని సీఐసీ 2016 డిసెంబర్ 21న ఢిల్లీ యూనివర్సిటీని ఆదేశించింది. ప్రధాని మోదీ అదే సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేశారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ యూనివర్సిటీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తున్నారు. కేసు తదుపరి విచారణను 2026 జనవరి 16వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

# 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు

- మొదటి పేజి తరువాయి

గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అవి కూడా ఊరికి దూరంగా కొండలు, గుట్టల్లో ఇచ్చి చదును పేరుతో కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను కూడా పందికొక్కుల్లా తిన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలి**

ప్రజలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలి. నిన్న కనిగిరిలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలోనూ వీటిని ఏర్పాటు చేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు రూ.50 వేల కోట్లు రుణాలు తీసుకుని బాధ్యతగా చెల్లిస్తున్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. వారికి అన్ని విధాలా శిక్షణ ఇప్పించి వ్యాపారవేత్తలుగా మారుస్తాం" అని భరోసా ఇచ్చారు.

**ముస్లింలకు అదనపు సాయం.. కీలక ప్రకటనలు**

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో రూ.2.5 లక్షలు, గ్రామాల్లో రూ.2 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. ఇకపై బీసీలు, ఎస్సీలతో సమానంగా ముస్లిం మైనారిటీలకు కూడా గృహ నిర్మాణానికి రూ.50 వేలు అదనంగా అందిస్తామని ప్రకటించారు. దీనివల్ల ఆర్థిక స్థోమత లేక ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన దాదాపు 6 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వానికి రూ.3,220 కోట్ల భారం పడుతుందని వివరించారు.

**ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

భవిష్యత్తులో నిర్మించే ఇళ్లను ఆధునిక సౌకర్యాలతో అందిస్తామని చంద్రబాబు తెలిపారు. "ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు సబ్సిడీపై సోలార్ ప్యానెళ్లు అందిస్తాం. దీనివల్ల విద్యుత్ వినియోగదారులే ఉత్పత్తిదారులుగా మారతారు. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. నా తల్లి పడ్డ కష్టాలు చూసే దీపం పథకం పెట్టాను. ఇప్పుడు 'దీపం 2.0' కింద ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తామని, పులివెందులతో సహా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ఉగాది నాటికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామని, ఇల్లు లేని అర్హులందరినీ గుర్తించి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తామని, పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తప్పు చేశాను.. ఇకపై చేయను..

బెట్టింగ్ యాప్స్‌లు, గేమింగ్ యాప్స్‌లలో పెట్టుబడులు పెట్టి ఎంతోమంది యువత ఆర్థికంగా నష్టపోతున్నారని, దీనివల్ల వారి కుటుంబాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నటుడు ప్రకాశ్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2016లో తాను ఒక యాప్‌న ప్రమోట్ చేశానని, అయితే ఆ యాప్ 2017లో బెట్టింగ్ యాప్‌గా రూపాంతరం చెందిందని ఆయన తెలిపారు.

వెంటనే తాను ఆ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేనని ప్రకాశ్ రాజ్ అన్నారు. ఈ విషయంలో తాను క్షమాపణ కోరుతున్నానని ఆయన తెలిపారు. సిట్ అధికారులకు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డాక్యుమెంట్స్, బ్యాంకు లావాదేవీలను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ల

కారణంగా ఎంతోమంది నష్టపోయి, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడితేనే ఫలితం ఉంటుందని, కష్టపడితేనే డబ్బులు వస్తాయని కాబట్టి అందరూ కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు తనను క్షమించాలని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరగకుండా చూసుకుంటానని ఆయన అన్నారు.

## యువత కలల సాకారం కోసం కృషి చేయాలి

- మొదటి పేజి తరువాయి

వ్యవస్థగా మార్చేందుకు ఉన్నత విద్యను పునఃరూపకల్పన చేయడం' అనే థీమ్‌తో ఈ సదస్సును ఏర్పాటు చేశారని, అయితే తాను ఈ అంశంతో పూర్తిగా ఏకీభవించడం లేదని లోకేశ్ అన్నారు. "5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం మనకు అత్యంత సమీపంలో ఉంది. దానిని మనం సులభంగానే చేరుకుంటాం. కానీ, అసలు ప్రశ్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎలా ఎదగాలన్నదే. మానవ వనరులు, మేధోసంపద లేకుండా ఇంతటి ఆర్థికవృద్ధి అసాధ్యం. ఈ మహోన్నత లక్ష్య సాధనలో మన ఉన్నత విద్యారంగమే వ్యూహాత్మక మూలస్తంభంలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**నైపుణ్యాల కొరత అతిపెద్ద సవాలు**

ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నైపుణ్యాల కొరత అని లోకేశ్ అన్నారు. ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం మన గ్రాడ్యుయేట్లలో కేవలం 51 శాతం మాత్రమే ఉద్యోగాలకు అర్హులుగా ఉన్నారని, ఇది మన యువత మేధస్సు లోపం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం బోధించే అంశాలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అసమతుల్యతే దీనికి ప్రధాన కారణం. మన విద్యాసంస్థల్లో 3-4 ఏళ్ల కోర్సులు పూర్తి చేసినా యువతకు ఉద్యోగాలు రావడం లేదు. కానీ, హైదరాబాద్ అమీర్‌పేటలోని కోచింగ్ సెంటర్లు కేవలం 3-4 నెలల శిక్షణతోనే వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చడానికే ఉన్నత విద్యలో ప్రాథమిక మార్పులు రావాలి. డిగ్రీలతో పాటు క్రియాశీల నైపుణ్యాలపై దృష్టి సారించాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు. భారత జనాభాలో 54 శాతం మంది 25 ఏళ్లలోపు వారేనని, ఇది మనకు డెమోగ్రాఫిక్ డివిడెండ్ అని ఆయన గుర్తుచేశారు. అయితే, దక్షిణ కొరియాలో 96 శాతం, జపాన్‌లో 80 శాతం, జర్మనీలో 75 శాతం మందికి నైపుణ్య శిక్షణ ఉండగా, మన దేశంలో అది కేవలం 34.7 శాతం మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను పరిశ్రమలకు అవసరమైన ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినప్పుడే వారు దేశానికి నిజమైన ఆస్తిగా మారతారని అన్నారు.

**'స్కిల్ సెన్సస్'తో అంతరానికి చెక్**

ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాల అంతరాన్ని (స్కిల్ గ్యాప్) భర్తీ చేసేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో తమ ప్రభుత్వం 'స్కిల్ సెన్సస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని లోకేశ్ వెల్లడించారు. "16 నెలల క్రితం ఏర్పడిన మా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని నా సొంత నియోజకవర్గం మంగళగిరి నుంచే ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి నైపుణ్యాలను అంచనా వేసి, లోటుపాట్లను గుర్తిస్తాం. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి పరిశ్రమలకు సిద్ధం చేయడమే దీని లక్ష్యం. దీనికి అనుబంధంగా 'నైపుణ్యం పోర్టల్' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తాం" అని తెలిపారు.

**స్వర్ణాంధ్ర లక్ష్యంతో ముందుకు**

ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా, తాము 'విజన్-2047: స్వర్ణ ఆంధ్ర' డాక్యుమెంట్‌తో ముందుకు సాగుతున్నామని లోకేశ్ ప్రకటించారు. "2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను

2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం మా లక్ష్యం. 2029 నాటికి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడమే మా ధ్యేయం. ఇప్పటికే గత 17 నెలల్లో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం. త్వరలో జరగబోయే సదస్సులో మరో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం బలోపేతమవుతుంది" అని అన్నారు.

## డబ్బు కోసమే చంద్రబాబు కుట్ర.. మెడికల్ కాలేజీల భూములు రూ.100కే అమ్మకం

ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను కేవలం వంద రూపాయలకే కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "50 ఎకరాల మెడికల్ కాలేజీ భూముల ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల ఆదాయం వస్తుంది. పేద విద్యార్థులు డాక్టర్లు అయ్యేందుకు అవకాశం లభిస్తుంది. కానీ, కాలేజీలను ప్రైవేటుపరం చేయడం వల్ల రాష్ట్రం సుమారు 2150 మెడికల్ సీట్లను కోల్పోతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

పులివెందులలో 50 సీట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయినా, చంద్రబాబు అడ్డుపడి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాశారని పెద్దిరెడ్డి మండిపడ్డారు. గతంలో వైఎస్ జగన్ 'నాడు%-%నేడు' కింద ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు అవన్నీ మూలన పడ్డాయని అన్నారు. "రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటైతే ఏటా 4500 సీట్లు అదనంగా వస్తాయి. ఐదేళ్లలో 30 నుంచి 40 వేల మంది వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ఇంతటి ప్రయోజనాన్ని దెబ్బతీస్తూ, కేవలం డబ్బు ఆశతోనే చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులు, మంత్రులు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు" అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు.

## భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ...
## ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ

- మొదటి పేజి తరువాయి

లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి వెళ్లారు. ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడులో గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని, ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను, బాధితులకు అందుతున్న వైద్యాన్ని గురించి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భూటాన్ పర్యటనలో ఉండగానే ప్రధాని మోదీ ఢిల్లీ పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ఢిల్లీలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను నేను అర్థం చేసుకోగలను. ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చాను. ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది. మన ఏజెన్సీలు ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తాయి. బాధ్యులైన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం" అని భూటాన్ రాజధాని థింపులో ప్రధాని వ్యాఖ్యానించారు. దర్యాప్తు ముమ్మరం చేసిన ఎన్‌ఐఏమరోవైపు, ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుడు ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ముమ్మరం చేసింది. కేసు విచారణ కోసం 10 మంది అధికారులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్‌ఐఏ ఏడీజీ విజయ్ సఖారే నేతృత్వంలోని ఈ బృందంలో ఒక ఐజీ, ఇద్దరు డీఐజీలు, ముగ్గురు ఎస్పీలు, మిగిలిన వారు డీఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్‌ఐఏకి అప్పగించిన విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతస్థాయి భద్రతాధికారులతో సమావేశమై దర్యాప్తు పురోగతిని సమీక్షించారు.

కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. "దోషులను పట్టుకోవడంలో ఏ ఒక్క అంశాన్నీ విడిచిపెట్టం" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌ఐఏ, ఐబీ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. ఇది గరిష్ఠ నష్టం కలిగించే లక్ష్యంతో జరిపిన ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. వెయ్యికి పైగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. పేలుడు జరిగిన ప్రాంతంలోని మొబైల్ ఫోన్ డంప్ డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, ముంబై నగరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రార్థనా స్థలాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

### గుంటూరులో ఉద్రిక్తత... పోలీసులతో
## అంబటి రాంబాబు వాగ్వాదం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఆయనకు, స్థానిక సీఐకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు, బుధవారం నాడు అంబటి రాంబాబు గుంటూరులోని తన నివాసం నుంచి ర్యాలీ ప్రారంభించారు. స్వామి థియేటర్ వద్దకు చేరుకోగానే, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని నిలువరించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబుకు, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకు మధ్య మాటామాటా పెరిగింది. సీఐ తనతో దురుసుగా ప్రవర్తిస్తూ, వేలు చూపిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని అంబటి ఆరోపించారు. గతంలో కూడా ఇదే అధికారి తన పట్ల ఇలాగే ప్రవర్తించారని ఆయన పేర్కొన్నారు.

**లోకేశ్ కోసమే పోలీసులు ఓవరాక్షన్: అంబటి**

ఈ ఘటన అనంతరం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మేం 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభిస్తే.. ఈ ప్రభుత్వం వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి పేదలకు విద్యను దూరం చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి ఉద్యమిస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వం బడాబాబులకు కాలేజీలను కట్టబెట్టి లోకేశ్ జేబులు నింపుతున్నారు" అని అంబటి ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. "లోకేశ్ మెప్పు పొందేందుకే కొందరు పోలీసులు ఇలా ఓవరాక్షన్ చేస్తున్నారు. వారు పోలీస్ భాష మాట్లాడితే, మాకు ఆ భాష రాదా? పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు... లోకేశ్ బంధువు. అందుకే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ర్యాలీని అడ్డుకున్నారు. మమ్మల్ని అణిచివేయాలని, లోపల వేయాలని చూస్తున్నారు. మేం దేనికైనా సిద్ధం" అని హెచ్చరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపే వరకు తమ ఉద్యమం ఆగదని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఈ ఘటనతో గుంటూరులో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## దేశంలోని ఆరు ఎయిర్ పోర్టులకు బాంబు బెదిరింపులు..
## రంగంలోకి బాంబు స్క్వాడ్స్

- మొదటి పేజి తరువాయి

వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిళ్లు పంపించారు. దేశ రాజధాని ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు విమానాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు సంబంధిత విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు.

కోల్‌కతా నుంచి ముంబైకి వెళుతున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు రావడంతో, ఆ విమానంలోని 186 మంది ప్రయాణికులను కిందకు దించి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు. ఢిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## ఉగ్రవాదం మన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేదు..

- మొదటి పేజి తరువాయి

ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కష్టకాలంలో భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి తమ దేశం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. బుధవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా నెతన్యాహు స్పందించారు. "ప్రియ మిత్రుడు నరేంద్ర మోదీకి, ధైర్యవంతులైన భారత ప్రజలకు.. నేను, నా భార్య సారా, ఇజ్రాయెల్ ప్రజల తరపున బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ దుఃఖ సమయంలో ఇజ్రాయెల్ మీకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. భారత్, ఇజ్రాయెల్ ప్రాచీన నాగరికతలకు నిదర్శనాలని, శాశ్వత సత్యాలపై నిలబడినవని ఆయన పేర్కొన్నారు. "ఉగ్రవాదం మన నగరాలపై దాడి చేయగలదేమో కానీ, మన ఆత్మలను ఎప్పటికీ కదిలించలేదు. మన దేశాల వెలుగు.. శత్రువుల చీకటిని మించి ప్రకాశిస్తుంది" అని నెతన్యాహు తన సందేశంలో ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ కూడా ఈ దాడిని ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# మహా విశాఖలో నవంబర్ 25న షాప్ రూముల బహిరంగ వేలం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 12** :మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 3వ జోన్ పరిధిలోని పలు వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న షాప్ రూములు మరియు కమ్యూ నిటీ హాల్‌ను బహిరంగ వేలం ద్వారా కుదుర్చా లని నిర్ణయించింది. ఈ వేలం నవంబర్ 25న ఉదయం 11 గంటలకు ఆశీలి మెట్టలోని జోన్–3 కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు.జోనల్ కమిషనర్ వివరాల ప్రకారం 3వ జోన్ పరిధిలోని యం.వి.పి కాలనీ వాణిజ్య సముదాయంలో షాప్ నంబర్లు 04, 10, 11, 12, 13, 14, 15, 16, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయంలో షాప్ నంబర్లు 08, 09, జగ్గారావు బ్రిడ్జ్ వాణిజ్య సముదాయం లో షాప్ నంబర్ 06, అలాగే ఆర్.కె. బీచ్ రోడ్ ఎకో బజార్ వాణిజ్య సముదాయంలో షాప్ నంబర్లు 02, 03, మరియు బి.టి.ఆర్ కాలనీ, రెల్లివీధిలో గల కమ్యూనిటీ హాల్ ఈ ఆస్తులు మూడు సంవత్సరాల కాలానికి గుత్తుగా ఇవ్వబడనున్నాయని తెలిపారు.
వేలం వివరాలు, అర్హతలు మరియు షరతుల కోసం ఆసక్తి గల వ్యక్తులు పని వేళల్లో 3వ జోన్ కార్యాలయంలోని సంబంధిత పర్యవేక్షకులను సంప్రదించవచ్చని కమిషనర్ సూచించారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా





# ఆంధ్రా మెడికల్ కాలేజీలో అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

**వైద్య రంగం బలోపేతానికి కూటమి కట్టుబడి ఉందని మంత్రి స్వామి**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 12** :ఆంధ్రా మెడికల్ కళాశాలలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం మరియు కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డీ.ఎస్. బీవీ స్వామి, విశాఖ ఎం.పీ మతుకుమి ల్లి భరత్, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ, "నాడు ఈ కాలేజీలో విద్యార్థిగా నేర్చుకున్న నేను, నేడు ముఖ్య అతిథిగా రావడం గర్వకారణం. నాకు ఈ గౌరవం దక్కింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దయ వల్లే," అన్నారు. వైద్య వృత్తి అత్యంత పవిత్ర మైనదని, ప్రజల ఆరోగ్య రక్షణే వైద్యుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.మంత్రి స్వామి మాట్లా డుతూ, కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రూ. 8 కోట్లతో రెండు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించ నున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలోనే పేదల కోసం రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే హెల్త్ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.అలాగే సంజీవని పథకం ద్వారా రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేయనున్నట్లు తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం వల్ల పేద విద్యార్థులకు మరిన్ని సీట్లు లభిస్తాయని, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బాబ్జి, పార్టీ ఇన్‌ఛార్జి సుధాకర్, ఏఎంసి ప్రిన్సి పల్, సూపరింటెండెంట్, స్థానిక కార్పొరేటర్ అప్పల రత్నం, జనసేన అధ్యక్షురాలు శ్రీమతి యజ్ఞశ్రీతో పాటు పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు



**ప్రజలు సమాచారం ఇవ్వండి : కలెక్టర్, జిల్లా ఎస్పీ**

అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 12 : జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు సమన్వయపూర్వక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిసినవారు టోల్ ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షత వహించగా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో గంజాయి వినియోగంపై అవగాహన పెంపొందించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, ఎవరైనా గంజాయి వినియోగం లేదా విక్రయాలపై సమాచారం అందించిన వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 1972ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
అనంతరం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, గంజాయి నిరోధానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నాయని, రోజువారీగా కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. జిల్లాలోని తాటిపర్తి, కోనాం, దౌనూరు, భీమవరం, శ్రీరాంపురం ప్రాంతాల్లో శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 38 వాహన తనిఖీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైల్వే మార్గాల ద్వారా గంజాయి రవాణా అధికంగా జరుగుతున్నందున, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని చెప్పారు. గంజాయి నియంత్రణకు నెలరోజుల ప్రణాళిక రూపొందించామని ఎస్పీ తెలిపారు. మొదటి వారంలో ప్రజల నుండి సమాచారం సేకరణ, రెండవ వారంలో అందిన సమాచారాన్ని వర్గీకరణ, మూడవ వారంలో గంజాయి కార్యకలాపాలపై ప్రత్యేక ఆపరేషన్లు నాలుగో వారంలో కమిటీ సమీక్ష సమావేశం నిర్వహణ. అదనంగా, గంజాయి వ్యసన బాధితుల పునరావాసం కోసం ఎన్.టి.ఆర్ జిల్లా ఆసుపత్రిలో 15 పడకల డి–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 116 కేసులు నమోదు, 382 మంది అరెస్టు, 8,504 కిలోల గంజాయి స్వాధీనం, 109 వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఎక్సైజ్, ఎడ్యుకేషన్, హెల్త్, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహము నిర్మాణం కొరకు శంకుస్థాపన

**విశాఖ .పెన్ పవర్ నవంబర్ 12** మహారాణిపేటలో 6 కోట్ల రూపాయల వ్యయం తో సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహ నిర్మాణం కొరకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేపట్టారు. అదేవిధంగా నిర్మాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ప్రారంభించారు .కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు .బాలికల ఉన్నత చదువులు కొరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అనేక సదుపాయాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.
కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీమతి అనురాధ , స్థానిక కూటమి వార్డు అధ్యక్షులు శ్రావణ్ కుమార్ ,శేఖర్ ,29 వార్డు జనసేన సీనియర్ నాయకులు మన్యాల వాసు , కూటమి నాయకులు కాయిత శ్యామల,పీరు బాబు, పడిమి కిషోర్,మురళి, పెందుర్తి గిరి, సారిపిల్లి శ్రీనివాస్ ,శ్రీకాంత్,సాయి ,చిన్ని ,భార్గవ్,మజ్జి శ్రీను,పెసల శివ,కూటమి వార్డు ఇంచార్జ్ రవీశ్వర రావు , డిఈ,ఎఈ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు..









# తాండవ రిజర్వాయర్‌లో 10 లక్షల చేప పిల్లల విడుదల...





- తాండవ రిజర్వాయర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం.....
- స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు.....

**నాతవరం, పెన్ పవర్ (నవంబర్12):** మండలంలో గల తాండవ జలాశయం వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో తాండవ రిజర్వాయర్ లోకి బుధవారం చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత గంగమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించి, అనంతరం స్పీకర్ అయ్యన్న ,కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి తాండవ నీటిలో 10 లక్షల చేప పిల్లలను (ఫింగర్లింగ్స్) వదిలారు.

ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడ మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి రైతులు,మత్స్యకారులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.మన పూర్వీకులు ఎంతో దూరదృష్టితో నిర్మించిన ఈ రిజర్వాయర్ ద్వారా సుమారు 53 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంతో పాటు పాకలపాడు, కోటవురట్ల, కోటనందూరు,తుని వరకు రైతాంగం ఈ రిజర్వాయర్‌పై ఆధారపడి ఉందన్నారు.?గత ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీసం గేట్లకు పడిన కన్నాన్ని కూడా పూడ్చలేని దుస్థితిలో గత పాలన సాగిందని ఆయన విమర్శించారు.కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఎన్నికైన రిజర్వాయర్ కమిటీ సభ్యులు (324 మంది) రిజర్వాయర్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని వారిని ప్రత్యేకంగా అభినందించారు.నాతవరం నుండి తాండవ జంక్షన్ వరకు ఉన్న ఇరిగేషన్ రోడ్డును గతంలో పట్టించుకోలేదన్నారు. తాను ప్రత్యేక చొరవ తీసుకుని ఆ రోడ్డును ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేయించానని, రూ. 6.36 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఒకటి రెండు నెలల్లో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.?అలాగే తాండవ నుండి ప్రాజెక్ట్ స్పిల్‌వే వరకు ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు అవసరమని అధికారులు చెప్పారని,ఈ నిధులను సీఎస్ఆర్ గ్రాంట్ల ద్వారా సమీప ఫ్యాక్టరీల నుండి సేకరించి,రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి సంపూర్ణంగా కృషి చేస్తానని స్పీకర్ తెలిపారు.?రిజర్వాయర్‌పై ఆధారపడి 14 గ్రామాల మత్స్యకారులు జీవిస్తున్నారని, వారికి లబ్ధి చేకూర్చేందుకే 10 లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు 60 ఏళ్ల నుండి 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తుందని, ఈ ప్రాంతంలో ఇప్పటికే 62 మంది లబ్ధిదారులు ఈ పెన్షన్ పొందుతున్నారని తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ,ఆర్డీవో వివి రమణ,జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర,టిడిపి పార్టీ మండల అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,తాండవ వైస్ చైర్మన్ మేడపాటి జోగు బాబు, నాతవరం పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం,గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు,తాండవ డిఈ అనురాధ,ఎఫ్ డి ఓ నాగమణి, నాతవరం ఇన్చార్జి ఎమ్మార్వో మహేష్,ఉమ్మడి విశాఖ జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, అనకాపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి పి విజయ, స్థానిక నాయకులు, అధికారులు, రిజర్వాయర్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు మరియు మత్స్యకారులు పాల్గొన్నారు.

## రక్తదాతలు ముందుకు రావాలి జిల్లా కలెక్టర్ పిలుపు..





**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 12:**
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆయా శాఖల అధికారులు ఉద్యోగులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు.

స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనేకమంది రక్తహీనతతో బాధపడుతున్నారని గర్భిణులు బాలింతలకు అత్యవసర సమయంలో సస్త్ర చికిత్సలు నిర్వహించడం కోసం రక్తం అవసరం ఉంటుందని దీనిపై ప్రత్యేక దృష్టి సాధించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఇందులో భాగంగా నేడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాడేరు శాఖ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని ఇలా అన్ని శాఖల ఉద్యోగులు అధికారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు.

నెలవారి క్యాలెండర్ తయారు చేసి ఆయా శాఖలను సమన్వయపరచుకొని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందానికి జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసిన తర్వాత విస్తృతంగా రక్తదాన శిబిరాలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన అభినందించారు.

జిల్లాలోని రక్తపు నిలువలు పెంచేందుకు అన్ని శాఖల అధికారులు ఉద్యోగులు మండలాల వారీగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

బ్లడ్ బ్యాంక్ లో సిబ్బంది కొరతను అధిగమించేందుకు జిజిహెచ్, డిఎం అండ్ హెచ్ ఓ సమన్వయ పరుచుకుని రక్తదాన శిబిరాలకు సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ మూర్తి నాయక్ యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ జితేంద్ర శర్మ లీడ్ బ్యాంక్ మేనేజర్ మాత నాయుడు యూనియన్ బ్యాంక్ మేనేజర్ భానుచందర్,సూర్యనారాయణ రావు,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, కార్యదర్శి జి గౌరీ శంకర్రావు, కోశాధికారి పి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.జయలక్ష్మి, సుబ్రహ్మణ్యం,రవి,శ్రీనివాస్, ప్రసాద్ నాయుడు,సంజీవరావు యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదవాడి సొంత ఇంటి కలే నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం -పల్లా శ్రీనివాసరావు





**గాజువాక: పెన్ పవర్ ,నవంబర్ 12**
జోనల్ కార్యాలయంలో ప్రధాన మంత్రి అవ్వాజ్ యోజన పథకంలో గాజువాక నియోజకవర్గం లో ఎంపికైన లబ్ధిదారులకు 2.5 లక్షలు విలువ చేసే వర్క్ ప్రొసీండింగ్స్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో లబ్ధిదారులతో పల్లా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకానికి ఎంపిక అయ్యారని అన్నారు. అలాగే విశాఖ జిల్లా మొత్తంలో 2800 మందిగా, గాజువాక నియోజకవర్గానికి 1343 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గాజువాక నియోజవర్గానికి చెందిన లబ్ధిదారులకు సుమారు 335 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఈ యొక్క అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ ఈఈ. డి సుబ్రహ్మణ్యం, ఏ ఈ గోపాల కృష్ణ, జోనల్ కమీషనర్ శేషాద్రి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి, నియోజకవర్గ టీడీపి ఇంచార్జి ప్రసాదుల శ్రీనివాస్, బీజేపీ ఇంచార్జి కరణం రెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బోండా జగన్, పల్లా శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, రాజాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని ఆవిష్కరణ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన

### జిల్లా వైద్య,శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్.




**పాడేరు,పెన్ పవర్,నవంబర్ : 12:**
ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ న్యూమోనియా దినోత్సవ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో జండా ఊపి ప్రారంభించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి కృష్ణమూర్తి నాయక్ తెలియజేసారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ శీతాకాలంలో ఈ వ్యాధి తీవ్రంగా వ్యాప్తిచెందే అవకాసం ఉన్నదని, కావున అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లల్లోను, వృద్ధులలో మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వ్యాధి వ్యాప్తిచెందే అవకాసం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు వ్యాధి బారినపడి అధిక సంఖ్యలో మృతిచెందడం జరుగుచున్నదని తెలిపారు.

చిన్నారుల్లో పెరుగుతున్న న్యూమోనియా కేసుల దృష్ట్యా ముందుగానే అవగాహన కలిగి తగు జాగ్రత్త తీసుకున్నట్లయితే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు అన్నారు. న్యూమోనియా వ్యాధి ముఖ్య లక్షణాలు జ్వరం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఆయాసం, ఛాతీ నొప్పి, శరీరం నీలం రంగులోకి మారడం, పిల్లలలో మగత, ఆకలి లేకపోవడం వంటి మున్నగు వ్యాధి లక్షణాలు ఉంటాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన రోగులను సకాలంలో గుర్తించి చికిత్సలు అందించాలని అన్నారు. నిమోనియా వ్యాధి వ్యప్తిచెందకుండా చర్యలుగా శిశువులకు తల్లిపాలు ప్రాధాన్యత, పి.సి.వి వ్యాక్సిన్ మొదటి, రెండవ మరియు బూస్టర్ డోసులు మరియు రొటీన్ వ్యాక్సినేషన్‌ను సకాలంలో పూర్తి చేయించాలని, పిల్లలను పొగ, కాలుష్యం నుంచి దూరంగా ఉంచుట, అనారోగ్యం నుంచి కోలుకున్నవారికి పోషకాహారం అందించుట, వ్యాధి తో బాదపడుతున్న రోగులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా న్యూమోనియా వ్యాధి నుంచి కోలుకోవచ్చునని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి న్యూమోనియా టీకాలు వేయించుకోని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామ స్థాయి నుండి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో ప్రజలకు, చిన్నారులకు అవగాహన కలిపించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలియజేసారు. తేది 12.11.2025 నుండి 28.02.2026 వరకు పి.హెచ్.సిల పరిధి వైద్య సిబ్బంది, ప్రభుత్వ ఇతర శాఖల సిబ్బంది, అంగన్వాడి మరియు ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతో న్యూమోనియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఇప్పటికే వైద్యాధికారులకు ఆదేశించడం జరిగిందని అన్నారు. ఏ.ఎన్.ఏం, ఆశ మరియు అంగన్వాడీ కార్యకర్తలు ఈ ప్రచార కార్యాక్రమాన్ని విశ్రుతంగా నిర్వహించేలా పి.హెచ్.సిల వైద్యాధికారులు చర్యలు తీసుకోని రోజువారి నిర్వహించిన శిభిరాలు, గుర్తించిన రోగులు, అందించిన చికిత్సల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపించాలని ఆదేశించడం జరిగింది.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మినుములూరు పరిధి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పాడేరు అంబేద్కర్ కూడలి నుండి ఆర్.టి.సి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రజలకు న్యూమోనియా అవగాహన కలిపించడం జరిగింది.

ఈ కార్యాక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి కృష్ణమూర్తి నాయక్ గారు, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారిణి డా. సి హెచ్ కమల కుమారి, జిల్లా డిప్యూటి డెమో శ్రీమతి పి. సింహాచలం, జిల్లా స్టాటిస్టికల్ అధికారి జే కైలాస్, డి.పి.హెచ్.ఎన్.ఓ శ్రీమతి భూలోకమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మినుములూరు వైద్య సిబ్బంది మరియు ఆశ కార్యకర్తలు పాల్గున్నారు.

## పీపీపీ పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలి

- ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు కరణ చేస్తే ఉద్యమం చేస్తాం
- పాడేరు శాసన సభ్యులు వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు.





**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 12:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాడేరు శాసన సభ్యులు వైసిపి అల్లూరు జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో ఈరోజు పాడేరు నియోజకవర్గం జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు నిరాకరిస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లి ఆర్డీవో గారికి వినతి పత్రం అందజేశారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు నిర్మాణానికి అడుగులు వేశారు, నిర్మాణం చేపట్టిన ఈ మెడికల్ కాలేజీలు ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చెయ్యడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నారు, వైద్య విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు పీపీపీ పేరుతో చంద్రబాబు నాయుడు తీరని అన్యాయం చేస్తున్నారు,ఈ పీపీపీ ఆలోచన విధానాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలి లేదంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ డా.గుమ్మ తనూజ రాణి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మాజీ శాసన సభ్యురాలు,కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు మాజీ శాసన సభ్యులు చెట్టి పాల్గుణ,

మరియు నియోజకవర్గ వివిధ మండలాల ఎంపీపీ లు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మరియు జిల్లా నియోజకవర్గ, మండలాల వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ విజయాబేరి మోగించాలి..!

**కలిసికట్టుగా పని చేద్దాం జనసేన ను గెలిపిద్దాం అంటున్న మండల అధ్యక్షులు పడాల్**

**పెన్ పవర్ హుకుంపేట నవంబర్ 12** అల్లూరిసీతారామరాజు జిల్లా, అరకు నియోజకవర్గం, హుకుంపేట మండల కేంద్రంలో హుకుంపేట మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో మండల సమావేశం జరిపారు రాబోయే స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నవేల మండలంలో ముప్పై మూడు పంచాయతీలలోజనసేన ముఖ్య నేతలతో జరిగిన ఈసమావేశంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు విజయ జయబేరి మోగించాలని అయన పిలుపునిచ్చారు. ప్రతి నెల ఇకపై గ్రీవెన్స్ నిర్వహిస్తామని, ప్రజలు సమస్యలు తీర్చడం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం అని సమస్యలు పరిష్కారం చేసేదిశాగా ప్రణాళికలు రూపొందించామని అయన అన్నారు. స్థానిక ఎన్నికల కోసం కోర్ కమిటీ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పిసా చైర్మన్ మోహన్ దాస్, ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహన కమిటీ సభ్యులు పరదాని సురేష్, కార్యదర్శి ప్రసాద్,ప్రధాన కార్యదర్శి మోహన్,పిసా డైరెక్టర్ సరస్వతి, ఉపాధ్యక్షులు రాంబాబుదొర, మజ్జి, సోములు జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సర్ధార్ పటేల్ జయంతి విశాఖలో దేశభక్తి ఉత్సాహం యూనిటీ రన్ సందడి





**విశాఖ దక్షిణం,పెన్ పవర్, నవంబర్ 12 :**ఉక్కు మనిషి, భారత దేశ సమైక్యతకు ప్రతీక అయిన మాజీ ఉప ప్రధాని, కేంద్ర హోంమంత్రి సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సంద ర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యూనిటీ రన్ కార్యక్రమం విశాఖ బీచ్ రోడ్డులో ఘనంగా జరిగింది.మైభారత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖ పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్, నార్త్ ఎమ్మెల్యే విష్ణుకు మార్ రాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు మరియు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి యూనిటీ రన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మా ట్లాడిన వారు అఖండ భారతావని కోసం సర్ధార్ పటేల్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన స్ఫూర్తితో యువత దేశ అభివృద్ధికి కట్టుబడి ముందుకు సాగాలి" అని అన్నారు.కాళీమాత ఆలయం నుండి వైయంసిఏ వరకు భారత్ మాతా కీ జై" నినాదాలతో సాగిన యూనిటీ రన్‌లో పాల్గొన్న వందలాది యువత, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు ఉత్సాహంగా నడిచారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి సుజాత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, కూటమి నాయకులు సిరసపల్లి నూకరాజు, దానేష్, శంకరరావు, నాగేశ్వరరా వు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సర్ధార్ పటేల్ జయంతి సందర్భంగా దేశ ఐక్య తా సందేశాన్ని అందించిన ఈ యూనిటీ రన్ విశాఖ బీచ్ రోడ్డులో దేశభక్తి ఊపును నింపింది.

## మన్యంలోమారుమూలప్రాంతాలకు వైద్యం అందించండి...!

### సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్



**కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 12:**అల్లూరి జిల్లాలో మారుమూల ప్రాంతాలకు పూర్తిస్థాయిలో వైద్యం అందక అనేక మరణాలు జరుగుతున్నాయని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వైద్యం అందించడంలో విఫలం అవుతున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ విమర్శించారు బుధవారం పార్టీ జిల్లానాయకత్వంతో కలిసి జిల్లా వైద్యశాఖ అధికారి వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా పొట్టి కసత్యనారాయణ మాట్లాడుతూ... గిరిజనులు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పాలకులు మారుతున్న గిరిజనులు బ్రతుకులు మారడం లేదని విద్యా వైద్యం గిరిజనులకు అందనంత దూరంలో ఉంటున్నాయని అన్నారు ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో గిరిజన ప్రాంతం అంతరించిపోతుందని ఆయన ధ్వజమెత్తారు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన ప్రతి ప్రాథమిక వైద్య కేంద్రంలో నలుగురు డాక్టర్లను పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో వైరామవరం మండలం అప్పరు పార్క్ లో గల గుర్తేడు బొడ్డులంక పంచాయతీలో గుర్తేడు బొడ్డులంక ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందేలా చూడాలని 104 లను పటిష్టంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జుట్టుకు కుమార్, కమ్మిడి సింహాచలం, పాడేరు మండల కార్యదర్శి చంటి, రంపచోడవరం నాయకులు దినేష్ రెడ్డి, రాజశేఖర్, కృష్ణ,పాల్గొన్నారు

## గొడుగు మామిడి గ్రామంలో ఘనంగా పీఎం జన్ మన్ గృహాల గృహప్రవేశాలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 12:**అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్త వీధి మండలం, దామనాపల్లి పంచాయతీ, గొడుగు మామిడి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పీఎం జన్ మన్' గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని గృహ నిర్మాణ శాఖ ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల పర్యవేక్షించగా, స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి రుత్తుల లక్ష్మి, మండల పేసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, బిజెపి మండల అధ్యక్షులు కాకూరి శేఖర్,జనసేన మండల అధ్యక్షులు కొయ్యం బాలు పాల్గొన్నారు.గృహ లబ్ధిదారుల చేతుల మీదుగా గృహప్రవేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్గదర్శకత్వంలో పీఎం జన్ మన్ పథకం గ్రామీణ పేదలకు సొంత ఇల్లు అనే కలను నిజం చేస్తోంది. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసుకోవాలి" అని అన్నారు. ఎంపీడీవో రమణబాబు మాట్లాడుతూ, "వెనుకబడిన పివిటిజి గిరిజనులకు గృహాలు లభించడం ప్రభుత్వం సంక్షేమ దృష్టికి నిదర్శనం" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్లు సెగ్గే సూరిబాబు, పసుపులేటి చిట్టి పడాల్, పేసా కమిటీ సభ్యులు సీందిరి కర్రయ్య, సిదేరి రాజు బాబు, గౌరీ, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు సతీష్, గ్రామస్తులు నాగేశ్వరరావు, పాస్టర్ చంటిబాబు, శ్రీను, దినేష్,అలాగే గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో గృహప్రవేశాల సందర్భంగా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ప్రజలు ఆనందంగా పండుగ వాతావరణంలో పాల్గొన్నారు.

## పండగ వాతావరణం లో పీఎం ఏవై లబ్ధిదారుల గృహప్రవేశాలు



**కొయ్యూరు పెన్ పవర్ నవంబర్ 12:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పీఎం ఏవై పథకం రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల పక్కా గృహాలు మంజూరు సకాలంలో పూర్తిచేసి లబ్ధిదారులకు ఒకేసారి గృహప్రవేశం చేసుకోవడం శుభపరిణామమని కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు, మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని డౌనూరు పంచాయితీ 24 ఇల్లు శాంక్షన్ అవ్వగా అందులో ఐదు ఇల్లు పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... గిరిజనులకు ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు అందించడంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొట్టిక భవాని, కూటమి నేతలు సత్యవతి, సురేష్ పట్నాయక్, ఎంపీడీవో జీడివి ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్స్పెక్టర్ గిరీష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో మంత్రి డీఎస్ బీవీ స్వామి పర్యటన

### పేదలకు ఇళ్ల పంపిణీ, అభివృద్ధి పై స్పష్టమైన దిశ





**భీమిలి, పెన్ పవర్, నవంబర్ 12. :**జిల్లా ఇంఛార్జి మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఈరోజు భీమిలి నియోజ కవర్గంలోని పద్మనాభపురం మండలం రెడ్డిప ల్లెలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పేదలకు ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామితో పాటు విశాఖ ఎంపీ మతుకుమిల్లి భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి స్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని పేర్కొన్నారు. ఒకే రోజున మూడు లక్షల పేదలకు గృహ ప్రవేశాలు జరపడం చరిత్రలో నిలిచిపో తుందన్నారు.కూటమి ప్రభుత్వం పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి అని తెలిపారు. పేదల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తుంటే, అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డికి అసహ్యం అవుతోంది అన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారం నిరాధారం అని మంత్రి స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీలు పేద విద్యార్థులకు అదనపు మెడికల్ సీట్లు కల్పించడంతో పాటు పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించను న్నాయని వివరించారు. గత ప్రభుత్వ కాలంలో కేంద్రం నిధులు తప్ప జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి దుయ్యబట్టారు.

## జనజాతి గౌరవ దివాస్ ముఖ్య అతిథిగా ఒడిశా ముఖ్య మంత్రి

* విగ్రహ ప్రతిష్ట కు భూమి పూజ చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి



**పాడేరు,పెన్ పవర్, నవంబర్ 12 :**బుధవారం: ఈ నెల 16 న పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగే జనజాతి(గిరిజన) గౌరవ దివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిదిగ ఒడిశా రాష్ట ముఖ్య మంత్రి మోహన్ చరణ్ మాంజీ గారు హాజరువుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు మఠం శాంత కుమారి అన్నారు, బుధవారం చింతల వీధి జంక్షన్ వద్ద ప్రతిష్టించ నున్న భగవాన్ బిర్సా ముండా విగ్రహ ప్రతిష్ట స్థలం లో భగవాన్ బిర్సా ముండా ఉత్సవ సమితి సభ్యులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు,ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో ఈనెల 16 న పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జనజాతి గౌరవ దివాస్ కార్యక్రమం నిర్భహించబోతున్నాం అన్నారు, ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి అన్ని తెగల గిరిజన ప్రతి నిధులు పాల్గొంటారని అన్నారు, గిరిజన స్వాతంత్ర సమర యోధులు భగవన్ బిర్సా ముండా గారి ప్రాణత్యాగం నేటి యువ తరానికి తెలపటంకోసం 2021 లో గౌరవ ప్రధాన మంత్రి నవంబర్ 15 భగవాన్ బిర్సా ముండా జయంతి నీ జనజాతి గౌరవ దివాస్ గా ప్రకటించారాని తెలిపారు, ఈ కార్యక్రమం లో విశిష్ట అతిధులు గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవి ఎన్ మాధవ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర వైద్య ఆరోగ్యం, వైద్య విద్య శాఖమంత్రి వై సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు, కావున గిరిజన ప్రజానీకం అంత ఈ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమం లో భగవాన్ బిర్సా ముండా ఉత్సవ సమితి సభ్యులు సూర్యనారాయణ నాయుడు, అబ్బాయి దొర, పెనుమాక రవి కుమార్, కుడుముల వెంకటరమణ, మినుముల గోపాల పాత్రుడు, పాంగి మత్స్య కొండ బాబు, తాంగుల సత్యవతి, కేజీయ రాణి, గుడిపాటి సుబ్బరాజు, అంగనైని ఆనంద్, ఉప్పర అశోక్ కుమార్,కొండ పల్లి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

## చెక్ "ధాం" లు మరమ్మతులు చేయండి...

ముంథా తుపాన్ లో మరింత దెబ్బ తిన్న చెక్ డాములు.






**హుకుంపేట పెన్ పవర్ నవంబర్ 12** అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం పలు గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు సతక బొంజుబాబు మరియు క్లస్టర్ ఇన్చార్జి కూడేలి నూకరాజు రాపా సెగ్మెంట్ మాజీ ఎంపిటిసి పాడి బాలు అన్న కోట్నాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు సాంబే బాబురావు పాటకోట గ్రామ కమిటీ అధ్యక్షులు కొర్ర నరసిగారావు పర్యటించి గ్రామాల్లో మరమ్మతులకు గురైన చెక్ డాములను పరిశీలించారు. తదుపరి ఎస్ఎంఐ జేఈఈ రాంజీకు చెక్ డాములను చూపించి మరమ్మతులకు గురైన చెక్డాములను వెంటనే రిపేర్ చేయాల్సిందిగా వారు కోరారు అంతేకాకుండా అవసరమైన గ్రామాలను గుర్తించి కొత్తవి నిర్మాణాలు చేయాలని వారు సూచించారు. సానుకూలంగా స్పందించిన జేఈఈ రాంజీ పై అధికారులకు తెలియజేస్తానని ఆయన అన్నారు అంతే కాకుండా తదిత్వంలో పనులు ప్రారంభమయ్యే దశలో కృషి చేస్తామని ఆయన మాట ఇవ్వడంతో నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం తెలుగుదేశం నాయకులు మరియు కార్యకర్తలు తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఊపు అందుకున్న వరి కోతలు..

వినూతన పద్ధతిలో కోతలు మరియు నూర్పులు.



**హుకుంపేట పెన్ పవర్ నెంబర్ 12** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలో పంట పొలాల్లో వరి కోతలు మరియు నూర్పులు ముమ్మురంగా ప్రారంభమయ్యాయి హుకుంపేట మండలం గడుగపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు కూలీలు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. దీంతో కొత్త ఆలోచనకు తెర తీశాడు గడ్డి కోసే యంత్రాన్ని కొనుక్కొని దాంతో వారిని కోయడం ప్రారంభించారు దీంతో పని చాలా వేగవంతం అవుతుందని మరియు కూలీల సమస్య తీరిందని ఆయన తెలిపారు ఆయన చేసే విధానాన్ని చూసి ఆ దారిలో పోయేవారు ఔరా అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

## విశాఖ అభివృద్ధి దిశగా వి ఎం ఆర్ డి ఎ కృషి ప్రశంసనీయం ఉండవల్లి శ్రీదేవి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 12 :**రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి ఉండవల్లి శ్రీదేవి బుధవారం వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ని మర్యాదపూర్వకంగా కలిసారు. నగర పర్యటనలో భాగంగా విశాఖపట్నం వచ్చిన శ్రీదేవి గారు, చైర్మన్ ప్రణవ్ గోపాల్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ పరిధిలో జరుగు తున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ తదితర అంశాలపై ఇద్దరూ చర్చించారు. ప్రత్యేకంగా ఎస్సీ వర్గాల సంక్షేమా నికి వి ఎం ఆర్ డి ఎ చేపడుతున్న సామాజికాభివృద్ధి కార్యక్రమాలు గురించి చైర్మన్ శ్రీదేవి అభినందనలు తెలిపారు.

ఈ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈతలపాక సుజాత, నాగ భూషణ్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పద్మ, సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రింతాడ బాలికల ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 12**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని రింతాడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికల) విద్యార్థినులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జ్ఞాన భారతి నిర్వహించిన 'విద్యార్థినుల విజ్ఞాన్ మంతన్' లెవెల్-1 పరీక్షల్లో రింతాడ పాఠశాల విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించారు.ఈ పరీక్షల్లో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పాల్గొనగా, రింతాడ బాలికల పాఠశాలకు చెందిన సాగిన తేజస్విని (10వ తరగతి), బిసుదొర శ్రీవల్లీ (10వ తరగతి), వంతల అఖిల (9వ తరగతి) అనే ముగ్గురు విద్యార్థినులు జాతీయ స్థాయిలో అర్హత సాధించి తమ ప్రతిభను నిరూపించాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర, వార్డెన్ గంగాభవాని, తోటి సిబ్బంది మాట్లాడుతూ ః

"మా విద్యార్థినులు జాతీయ స్థాయిలో అర్హత సాధించడం గర్వకారణం. రాబోయే లెవెల్%-%2 పరీక్షల్లో మరింత ప్రతిభ కనబరచి భారత ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ పొందాలని ఆకాంక్షిస్తున్నాం. విద్యార్థినుల ప్రతిభకు అవసరమైన అన్ని సహకారాలు అందిస్తాం" అని తెలిపారు.గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థినుల ఈ విజయాన్ని అభినందించారు.

## రైతు నేస్తం అడపా లక్ష్మికి సన్మానించిన తపాలా శాఖ సిబ్బంది



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 12:** అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకే వీధి మండలం,జెర్రెల గ్రామం అతి మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ అడపా లక్ష్మి తన కృషితో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించారు. హైదరాబాదులోని స్వర్ణ భారతి స్టేడియంలో, ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 25న నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్వయంగా ఆమెకు 'రైతు నేస్తం అవార్డు'ను ప్రదానం చేశారు.ఈ విషయాన్ని తెలుసుకున్న పోస్టల్ సూపరింటెండెంట్ సిహెచ్. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, పోస్టల్ ఇన్స్పెక్టర్ బి. దివాకర్ మూర్తి చింతపల్లి తపాలా కార్యాలయంలో అడపా లక్ష్మిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ దివాకర్ మూర్తి మాట్లాడుతూ,"అతి మారుమూల ప్రాంతంలో నివసించే ఒక సాధారణ గిరిజన మహిళ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడం గర్వకారణం. అడపా లక్ష్మి ఆర్గానిక్ పంటలపై చూపిన ఆసక్తి ఇతరులకు ప్రేరణగా నిలుస్తుంది," అని అభినందించారు.తదనంతరం అవార్డు గ్రహీత అడపా లక్ష్మి మాట్లాడుతూ,"ప్రస్తుతం తపాలా శాఖ కూడా బ్యాంకులకు దీటుగా సేవలందిస్తోంది. ప్రతి గ్రామానికీ చేరి ప్రజలకు అండగా నిలుస్తోంది," అని పోస్టల్ సిబ్బందిని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఎస్.పి.ఎం. డి. మహేష్, ఇతర పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.సన్మానం సందర్భంగా తపాలా కార్యాలయం ప్రాంగణం ఆనందోత్సాహాలతో మార్మోగింది.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి





★ స్పీకర్ శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు.....

**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 12):** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు చిన్నతనం నుంచే కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.బుదవారం మండలంలో గల మర్రిపాలెం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంకు మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ కృష్ణారావు సుమారు రూ. 6 లక్షల విలువైన బల్లలను విరాళంగా అందించారు.ఈ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్న, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.?ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దాత కృష్ణారావు ఉదారతను అభినందించారు.ఒకప్పుడు సరైన అవకాశాలు లేక తాను కాకినాడ వెళ్లి చదువుకున్నానని,నేటి తరానికి అందుబాటులో ఉన్న మెరుగైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లలు చదువులో అద్భుతంగా రాణించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.?"ప్రతి విద్యార్థి డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్ వంటి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ కలను సాకారం చేసుకునే దిశగా కష్టపడాలి" అని స్పీకర్ హితవు పలికారు.గ్రామాభివృద్ధి విషయంలో మర్రిపాలెం గ్రామస్థుల ఐక్యత ఆదర్శనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడాలని సూచిస్తూ, విద్య, వైద్య రంగాలకు తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి వి రమణ,తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ,జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోపాలపట్నంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవం

### గోడపత్రిక ఆవిష్కరణ చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 12 :** గోపాలపట్నంలోని ప్రశాంత్ నగర్‌లో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరగనున్న షష్ఠి మహోత్సవం సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన, "శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవం గోపాలపట్నం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తుంది. ప్రతి ఏటా జరిగే ఈ వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరుకుంటున్నాం" అని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు షష్ఠి మహోత్సవం నవంబర్ 27 బుధవారం ఘనంగా నిర్వహించబడనుందని. మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుద్ధ శివాజీ, గంద్రేడి పెదబాబు, ఆయతంశెట్టి కోటి, చందన గాంధి, నరిపిన్ని సత్తిరాజు, మూర్తి పట్నాయక్, దాడి రమేష్ నాయుడు, బొడ్డేటి విజయ్, నవీన్, రాజశేఖర్, అలాగే ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. షష్ఠి మహోత్సవం నాడు స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## యువతకు బ్యాంక్ లింకేజ్ లేకుండా రుణాలు ఇవ్వాలి

### ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



**విశాఖ తూర్పు పెన్ పవర్ నవంబరు 12:**రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్ బుధవారం నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్,(మాదిగ )చైర్మెన్ ఉండవల్లి శ్రీదేవి ని, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, నాయకులు గాడి సత్యం, ఆమెను మర్యాద పూర్వకంగా కలసి సాలువతో సత్కరించారు.ఈసందర్భంగా చైర్మన్ విశాఖ లో యువతకు స్వయంఉపాధి రుణాలు బ్యాంకు లింకేజి లేకుండ ఎస్సీకార్పొరేషన్, ఎన్ ఎఫ్ డి%జ%సి ద్వార సబ్సిడీ రుణాలు అందజేయాలనీ ఆమెను వారు కోరారు.

## విశాఖ పశ్చిమలో ప్రభుత్వ విప్ గణబాబు మీడియా సమావేశం

### రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడులపై స్పష్టత ఇచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 12 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు కీలక అంశాలపై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ యొక్క సంస్థాగత నిర్మాణం, రాబోయే పెట్టుబడుల సదస్సు ప్రాధాన్యం, రాష్ట్ర అభివృద్ధిపై వైసీపీ వైఖరి వంటి అంశాలను వివరించారు.

పార్టీ సంస్థాగత నిర్మాణంపై గణబాబు వివరణ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక బలమైన సంస్థాగత వ్యవస్థపై నడుస్తుందని. గతంలో గ్రామ స్థాయి కమిటీల నుండి రాష్ట్ర స్థాయి కమిటీల వరకు నిర్మాణం ఉండేదని, ఇప్పుడు కొత్త విధానంలో ప్రతి బూత్‌కి కన్వీనర్, కో-కన్వీనర్లను నియమించి, ఐదు బూత్‌లను ఒక యూనిట్‌గా కలిపి కస్టర్ స్థాయి కమిటీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియలో సభ్యుల అభిప్రాయం తీసుకొని ప్రమాణ స్వీకారం కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**పెట్టుబడుల సదస్సు – రాష్ట్ర భవిష్యత్తు దిశగా..**

విశాఖ వేదికగా రాబోయే మూడు రోజుల పాటు జరిగే సదస్సు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించబోతోందని గణబాబు అన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం కింద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రపంచవ్యాప్తంగా 400 కంపెనీలు ఎంఓయులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

హైదరాబాద్ అభివృద్ధికి "విజన్ 2020" ఎంత ముఖ్యమైందో, అదే విధంగా ఇప్పుడు "విజన్ 2047" రాష్ట్ర అభివృద్ధికి దారి చూపుతుందని ఆయన వ్యాఖ్యానించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల సమాన అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని ఐటీ, ఏఐ, ఇండస్ట్రీ రంగాల్లో పెట్టుబడులు తీసుకురావడమే ఈ సదస్సు ఉద్దేశమని తెలిపారు.

**వైసీపీపై ఎమ్మెల్యే విమర్శలు..**

వైసీపీ నాయకుల ఆలోచన రాష్ట్రాభివృద్ధి పట్ల కాకుండా రాజకీయ ప్రయోజనాల దిశగా ఉందని గణబాబు విమర్శించారు.

పెట్టుబడులు రాకుండా అడ్డంకులు సృష్టించడం, మెడికల్ కాలేజ్ అంశాన్ని రాజకీయ రంగంలోకి తేవడం వంటి చర్యలు రాష్ట్ర ప్రయోజనానికి విరుద్ధమని అన్నారు. "జగన్మోహన్ రెడ్డి భవనాలపై ఖర్చు చేసిన 70 కోట్లు ఒక మెడికల్ కాలేజ్ నిర్మాణానికి సరిపోతాయని వ్యాఖ్యానించారు.

**రాష్ట్ర ఖజానా దోపిడీ, అవినీతి ఆరోపణలు..**

వైసీపీ పాలనలో ఖజానా దోపిడీ జరిగిందని, అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని గణబాబు అన్నారు. సంక్షేమ పథకాల కంటే అవినీతి ప్రాధాన్యత పొందిందని, పెట్టుబడిదారులను రాష్ట్రం నుండి తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు.

**పెట్టుబడిదారులకు సురక్షిత వాతావరణం..**

ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం నెలకొన్నదని, ప్రపంచ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని గణబాబు తెలిపారు. దేశంలో జరిగిన ఢిల్లీ టెర్రరిస్ట్ దాడిని ఖండిస్తూ, అటువంటి పరిస్థితుల్లో కూడా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం గొప్ప విజయమని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు ఈ ప్రయత్నాలను అడ్డుకోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు.

**యువతకు ఉపాధి, రాష్ట్ర ప్రగతి ప్రధాన లక్ష్యం..**

మన రాష్ట్ర యువత దేశం వెలుపల ఉద్యోగాల కోసం వెళ్లకుండా, ఇక్కడే అవకాశాలు పొందేలా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని గణబాబు తెలిపారు. ఈ సదస్సు రాష్ట్ర యువత, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మీడియా సమావేశం మొత్తం రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, సంస్థాగత బలపరిచే దిశలో ఉన్న పార్టీ ప్రయత్నాలను ప్రతిబింబించింది.

రాజకీయ విభేదాలు పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల దిశగా అన్ని పార్టీలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# విశాఖ పశ్చిమలో టీడీపీ బలోపేత దిశగా కార్యక్రమం





## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో కమిటీల ప్రమాణ స్వీకారం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 12 :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశానుసారం, విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం, గోపాలపట్నం నందు పార్టీ బలోపేతానికి దోహదపడే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో వార్డ్ క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్, బూత్ కన్వీనర్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సేవా భావన పట్ల నిబద్ధతతో పనిచేయాలనే ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతుంది. ఈ కొత్త కమిటీల ద్వారా బూత్ స్థాయి వరకు పార్టీ శక్తి మరింతగా పెరగనుంది. ప్రతి సభ్యుడు ప్రజలకు చేరువై, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత వహించాలని అన్నారు. తదుపరి, ఆయన కొత్త కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, "టీడీపీ పునరుజ్జీవన దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి. పార్టీని బలంగా నిలబెట్టడమే మన అందరి ధ్యేయం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు మౌర్యసింహా, కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడీ రమణ, శరగడం రాజశేఖర్, గల్లా చిన్న గార్లు పాల్గొన్నారు. అదనంగా వార్డ్ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్లు, బూత్ కన్వీనర్లు తదితరులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ స్థాయి నిర్మాణాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే ఎన్నికల దృష్ట్యా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా ఈ ప్రమాణ స్వీకారం కొత్త దశను ప్రారంభించినట్టుగా నేతలు అభిప్రాయపడ్డారు.



# ప్రతి పేదవానికి సొంత గూడు ప్రభుత్వ సంకల్పం

## విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు







**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 12 :** పట్టణాల్లో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సొంత గూడు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెందుర్తి జోన్ పరిధిలోని వేపగుంట కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అర్బన్ పథకం కింద బెనిఫిషియరీ లీడ్ కన్స్ట్రక్షన్ (బిఎల్సి) పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు, పలువురు కార్పొరేటర్లు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

**పేదలకు గూడు కల్పించడమే లక్ష్యం..**

ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇది పేదల సంక్షేమ ప్రభుత్వమని, గూడు లేని ప్రతి నిరుపేద, మధ్యతరగతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్థలం ఉన్నా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు కట్టుకోలేని కుటుంబాలకు కేంద్ర%–%రాష్ట్ర ప్రభుత్వాలు కలసి సహాయం అందిస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అర్బన్ పథకం కింద ప్రతి అర్హుడికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1లక్ష వాటా కల్పిస్తుందని వివరించారు.

**709 మంది లబ్ధిదారులకు పత్రాల పంపిణీ..**

జీవీఎంసీ 77, 78, 93, 94, 95, 96, 97, 98 వార్డుల పరిధిలోని 709 మంది అర్హులైన లబ్ధిదారులకు బెనిఫిషియరీ లీడ్ కన్స్ట్రక్షన్ (బి ఎల్ సి) పత్రాలు పంపిణీ చేశామని అన్నారు.

"ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, పేద కుటుంబాల జీవితాల్లో భద్రత, స్థిరత్వం కల్పించే కార్యక్రమని ఆయన పేర్కొన్నారు.

**సంక్షేమం – అభివృద్ధి సమన్వయం..**

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.

"రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా, అభివృద్ధి మరియు పేదల సంక్షేమం రెండింటినీ సమాంతరంగా కొనసాగించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం," అని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించుకునే వారికి అందిస్తున్న ఆర్థిక సహాయం పేదలకు కొత్త ఆశలు నింపుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, రాపర్తి కన్నా, సేనాపతి వసంతలక్ష్మి, జోనల్ కమిషనర్ శంకర్, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ పేదల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న గృహనిర్మాణ విధానాలు స్పష్టమవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో స్థలాలున్నా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని కుటుంబాలకు పిఎంఏవై–అర్బన్ పథకం ఆశాకిరణంగా మారింది. ప్రభుత్వం కేంద్ర%–%రాష్ట్ర భాగస్వామ్యంతో ఇలాంటి పథకాలు అమలు చేస్తూ గృహ రహితుల సంఖ్యను తగ్గించడానికి కృషి చేస్తోంది. అదేవిధంగా, పేద కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించడమే కాక, పట్టణ అభివృద్ధికి కూడా ఈ పథకం తోడ్పడుతుంది.

# సింహాచలంలో ఉగ్రవాద దాడులను ఎదుర్కొనే మాక్ డ్రిల్ విజయవంతం








**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ :** శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, సింహాచలంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, సింహాచలం దేవస్థానంలో ఉగ్రవాద దాడులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన మాక్ డ్రిల్ విజయవంతంగా పూర్తయింది. మంగళవారం రాత్రి 9 గంటల నుండి బుధవారం తెల్లవారుజామున 2 గంటల వరకు జరిగిన ఈ డ్రిల్‌లో దేవస్థాన భద్రతా వ్యవస్థ యొక్క సన్నద్ధతను పరీక్షించారు. ఈ కార్యక్రమం ఉగ్రవాద నిరోధక దళం (ఆక్టోపస్) ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక పోలీస్ బలగాలు, దేవస్థానం భద్రతా సిబ్బంది (ఎస్పీఎఫ్), అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు, వైద్య బృందం మరియు ఇతర ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు ఈ డ్రిల్‌లో పాల్గొన్నారు.

**విభాగాల మధ్య సమన్వయం..**

డీఎస్పీ ఐ.తిరుపతయ్య మరియు ఇన్స్పెక్టర్ శివాజీ నేతృత్వంలో జరిగిన ఈ డ్రిల్ లక్ష్యం. అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం. వీరు మాట్లాడుతూ ఉగ్రవాద దాడులు లేదా ఇతర అత్యవసర ఘటనల సమయంలో ప్రతి విభాగం తక్షణ చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం అత్యంత అవసరం. భక్తుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తగిన మార్గదర్శకాలను పాటించడం ప్రతి శాఖ బాధ్యత," అని తెలిపారు.

**మాక్ డ్రిల్ ప్రక్రియ..**

డ్రిల్ సందర్భంగా ఊహాత్మకంగా ఒక ఉగ్రదాడి పరిస్థితిని సృష్టించి, పోలీస్ మరియు ఆక్టోపస్ సిబ్బంది తక్షణ ప్రతిస్పందన చర్యలు చేపట్టారు. దేవాలయం పరిసర ప్రాంతాల ఖాళీ చేయడం, గాయపడిన భక్తుల రక్షణ, అగ్నిమాపక బృందం ద్వారా మంటలను అదుపు చేయడం, వైద్య సిబ్బంది ద్వారా తక్షణ చికిత్స, ఉగ్రవాదులను నిర్వీర్యం చేయడం వంటి అంశాలు డ్రిల్‌లో భాగమయ్యాయి. ఇలాంటి డ్రిల్స్ ద్వారా దేవాలయ భద్రతా వ్యవస్థ మరింత బలపడుతుంది. భక్తుల భద్రత కోసం ప్రతి సిబ్బంది ప్రతిస్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే మా లక్ష్యం. దేవస్థానం అధికారులు కూడా అన్ని శాఖల సహకారాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి డ్రిల్స్‌ను మరింత పద్ధతిగా నిర్వహిస్తామని చెప్పారు.

ఈ మాక్ డ్రిల్ మూడు ముఖ్య అంశాలను స్పష్టంగా చూపించింది..

1. అంతరశాఖ సమన్వయం : అక్టోపస్, పోలీస్, ఎస్పీఎఫ్, వైద్య, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల మధ్య సమన్వయం సజావుగా జరిగింది.
2. సిద్ధత స్థాయి : ఉగ్రవాద దాడి వంటి పరిస్థితుల్లో దేవస్థానం సిబ్బంది ప్రతిస్పందన సామర్థ్యం మెరుగుపడింది.
3. భద్రతా మౌలిక సదుపాయాల పునర్మూల్యాంకనం : డ్రిల్ అనంతరం లోపాలను గుర్తించి, వాటిని సరిచేయడానికి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడింది.

సింహాచలం దేవస్థానంలో జరిగిన ఈ మాక్ డ్రిల్ భక్తుల భద్రత పట్ల అధికారుల కట్టుబాటును ప్రతిబింబిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతమైన ప్రతిస్పందనకు ఇది ఒక ప్రాయోగిక పాఠం అయింది.

# చింతపల్లి డైరీనగర్‌లో గృహప్రవేశాలు

**మూడు లక్షల గృహాల కార్యక్రమంలో భాగంగా 18 గృహాల ప్రారంభోత్సవం**





**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 12 :-** చింతపల్లి పంచాయతీ పరిధిలోని డైరీనగర్ గ్రామంలో 18 నూతన గృహాల గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ, ఎంపీడీఓ సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరీనగర్‌లో 18 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులంతా ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో శ్రమించి గృహాలు పూర్తి చేసి నేడు గృహప్రవేశాలు చేసుకోవడం ఎంతో ఆనందకరం, అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం స్వంతింటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. తమ స్వంత గృహ కల నిజమైనందుకు గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, గ్రామ పెద్ద మల్లిబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దారకొండ మండల కేంద్రం ఏర్పాటు కోసం జనసేన భారీ సమావేశం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 12:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పరిధిలోని దారకొండను ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీ సమావేశం నిర్వహించారు.దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల, సీలేరు పంచాయతీల నుండి వచ్చిన పార్టీ నాయకులు, ప్రజలు ఈ సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న దారకొండ ప్రాంతం ప్రజలకు సులభ పరిపాలన అందించాలంటే దానిని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.ఈ సందర్భంగా జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ వీర వెంకట్ మాట్లాడుతూ "దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి. ఈ ప్రాంతం భౌగోళికంగా దూరంగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం ఏర్పడితే స్థానికులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతాయి," అన్నారు.జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య"దారకొండను మండల కేంద్రం ఏర్పాటుకు జనసేన పూర్తిగా అండగా ఉంటుంది. ప్రజల ఆకాంక్ష సాధన కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తుంది," అని వీర వెంకట్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దారకొండ ప్రాంత అభివృద్ధికి మండల కేంద్రం ఏర్పాటు అత్యవసరమని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు సిద్ధార్థ మార్క్, జనసేన పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ కొయ్యం ఇమ్మానియేల్(సిద్దు) సీలేరు జనసేన పార్టీ అధ్యక్షులు జాగరపు బాలకృష్ణ, గూడెం పంచాయితీ జనసేన అధ్యక్షుడు గడుతూరి పరమేశ్వరరావు,జనసేన నాయకులు గబులంగి గణేష్ బోదరాజు,కోటి బాబు, రఘు వంశీ నాలుగు పంచాయతీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి



**జ్ఞానాపురం. పెన్ పవర్ నవంబర్ 12.**ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి,పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నాయకత్వంలో టిడిపిని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు తెలియజేశారు బుధవారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం పార్టీ ఇంచార్జి సీతంరాజు సుధాకర్ వార్డు అధ్యక్షునిగా ఐతి మధుబాబు తో ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా ఐతి మధుబాబు మాట్లాడుతూ వార్డు టీడీపీ అధ్యక్షునిగా 2021 వ సంవత్సరం నుంచి పని చేసానని, కార్పొరేషన్ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించానని అన్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్,పార్టీ పెద్దల సహకారంతో వార్డులోని ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా పాటుపడతానని ఐతి మధుబాబు తెలియజేశారు.

# బిర్సా ముండా జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి.

గిరిజన సంఘ నాయకులు పిలుపు.





**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 12.పెన్ పవర్.** పార్వతీపురం గిరిజన భవనంలో జరగబోయో బిర్సముండా జయంతి 2025 నవంబర్ 15 ఉత్సవాలకు ఆహ్వానంమేరకు గుమ్మలక్ష్మీపురం మండలం దొరజమ్ము ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బందికి,గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ అడ్డకుల నరేష్ స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ సర్పంచుల కార్యవర్గం అందరికి జిల్లా,ఏజెఏసి రాష్ట్ర ఏజెఏసి చైర్మన్ పిలుపు మేరకు ఈ ఉత్సవాలకు ప్రతి ఒక్క ఆదివాసీ ఉద్యోగ,నిరుద్యోగ,యువతి యువకులు వివిధ ప్రజా ప్రతినిధులు కూడా రావాలని ఈ కార్యక్రమం జయప్రదం చేయాలనీ తెలపుతూ కరపత్రాలు జరిగిందిద

# ప్రజా ఉద్యమ నిరసన ర్యాలీ.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం.





**అరకులోయ పెన్ పవర్ 12:** వైసీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలోఅరకులోయ నియోజకవర్గం, మండల కేంద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు వైసీపీ నేతలతో భారీ ర్యాలీ తహసిల్దార్ కు వినతి పత్రం అందించారు. మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకున్నదని,దానికి వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ర్యాలీ చేపట్టమని వారు తెలిపారు.కూటమి సర్కారు కక్షుపూరిత విధానాలతో రాష్ట్రంలో మెడికల్ సీట్లు కోల్పోయామని, తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయానికి వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణ నిలిపివేయాలి లేనిపక్షంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్య.ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు.అరకు, డుంబ్రిగూడ మండలాల జడ్పిటిసి సభ్యురాలు.

శెట్టి రోషిణి. చటారి జానకమ్మ .డుంబ్రి గూడ మండలం ఎంపీపీ బాకా ఈశ్వరి.వైసీపీ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిరి రవి ప్రసాద్.జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు. బూత్ కమిటీ ఇన్చార్జ్ విజయ్ పాంగి. కమ్మిడి అశోక్. నాగ భూషణ్. కొండబాబు. అరకు,డుంబ్రిగూడ, పెదబయలు, అనంతగిరి,హుకుంపేట మండల పార్టీ అధ్యక్షులు,స్వాభీ రామ్మూర్తి ,పాంగి పరశురాం ,మజ్జి చంద్రుబాబు,వైస్ ఎంపీపీలు ,కొర్ర సూర్య నారాయణ,పాంగి అనిల్.కొర్ర సుమంజలి ,కిల్లో రామన్న ,శెట్టి ఆనంద్,లలిత.సర్పంచులు,ఎంపీటీసీలు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన వైపు ఉత్సాహభరిత అడుగు





## అనకాపల్లి జిల్లాలో "అభ్యుదయం సైకిల్ ర్యాలీ" ప్రారంభం

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 12 :** యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి, గంజాయి నిర్మూలనలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి పోలీస్ శాఖ ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. "మాదకద్రవ్యాల రహిత భవిష్యత్తు వైపు పెడలింగ్" అనే నినాదంతో ప్రారంభమైన "అభ్యుదయం సైకిల్ ర్యాలీ"ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈరోజు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఘనంగా ప్రారంభించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆలోచనలతో రూపొందిన ఈ కార్యక్రమం సుమారు 30 రోజుల పాటు, 1000 కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్రగా కొనసాగనుంది. ర్యాలీ బృందం స్కూళ్లు, కాలేజీలు, గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన, చైతన్యం కల్పిస్తుంది.

హోంశాఖ మంత్రి స్వయంగా కొంతదూరం సైకిల్ తొక్కి యువతను ఉత్తేజపరచగా, విద్యార్థులతో కలిసి "మాదకద్రవ్యాలు వద్దు %-% జీవితమే ముద్దు" అనే ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ యువతే మన భవిష్యత్తు. వారిని మత్తు పదార్థాల పట్టు నుంచి దూరంగా ఉంచడం మన అందరి బాధ్యత" అన్నారు. ఆమె పేర్కొన్నది ఏమంటే ప్రభుత్వం ఇప్పటికే 'ఈగల్' పేరుతో ఒక ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ప్రారంభించింది. గంజాయి రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వెంటనే పోలీసులను సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. అలాగే ఎన్డిపిఎస్ చట్టాల కఠినతను గుర్తు చేస్తూ, "డ్రగ్స్‌కు నో - జీవితానికి యెస్" చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు.

**రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి విశ్లేషణాత్మక సమీక్ష..**

డీఐజీ ,మాట్లాడుతూ ఈ ర్యాలీ మాదకద్రవ్యాల నిర్మూలనలో చారిత్రాత్మక అడుగు. గంజాయి సాగు పూర్తిగా తగ్గిపోయిందిబీ ఈ ఏడాది జీరో కల్టివేషన్ సాధించాం" అని తెలిపారు. గత 14 నెలల్లో 865 ఎన్డిపిఎస్ కేసుల్లో 2,500 మందిని అరెస్ట్ చేశారు. 95 మందిపై పిఐటి ఎన్డిపిఎస్ 61 మందిపై పిడి యాక్ట్, మరియు 1,474 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరవడం జరిగింది. గంజాయి వ్యాపారంలో పాల్గొన్న 13 మందిపై రూ.10.04 కోట్ల ఆస్తులను జప్తు చేశారు. 2024-25లోనే 53 కేసుల్లో 87 మందికి 10 నుంచి 20 సంవత్సరాల శిక్షలు విధించబడ్డాయి. మొత్తం 60,369 కిలోల గంజాయి పట్టుకొని 768 వాహనాలు సీజ్ చేయబడ్డాయి. అదనంగా, "సంకల్పం" పేరుతో నిర్వహించిన 18,314 అవగాహన కార్యక్రమాలకు 10.41 లక్షల మంది హాజరయ్యారు, వీటిలో 4,649 విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యాంశం ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి పంటను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంటల పంపిణీ కార్యక్రమం. 2024-25లో 46.8 లక్షల మొక్కలు, 2025-26లో 1.35 లక్షల యూకలిప్టస్ మొక్కలు రైతులకు పంపిణీ చేశారు.

**అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ..**

ఈ ర్యాలీ కేవలం సైకిల్ ప్రయాణం మాత్రమే కాదు, మాదకద్రవ్యాల రహిత సమాజం వైపు ప్రజలతో కలిసి చేసే చైతన్య యాత్ర" అని అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకు 3,500 విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, మత్తు పదార్థాలపై సమాచారం అందించాలనుకునే వారు 1972 లేదా 112 నంబర్‌లకు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. మోహన్ రావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు. అభ్యుదయం సైకిల్ ర్యాలీ ఒక సాంప్రదాయ ప్రచార కార్యక్రమం కంటే ఎక్కువ. ఇది ప్రభుత్వ విధానాలు, పోలీసు చర్యలు, ప్రజా భాగస్వామ్యం అన్న మూడింటినీ సమన్వయం చేసే సామాజిక ఉద్యమంగా నిలుస్తోంది. డేటా ఆధారంగా చూస్తే గంజాయి సాగు మరియు రవాణాలో 90 శాతం పైగా తగ్గుదల చోటుచేసుకోవడం గణనీయమైన పురోగతిగా చెప్పవచ్చు. మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్" లక్ష్యంతో ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ, పోలీస్ శాఖ ప్రజలతో కలసి నడుస్తున్న చైతన్య ప్రస్థానంగా నిలుస్తోంది.



# దక్షిణ టీడీపీ శక్తిస్థాపన క్లస్టర్, వార్డ్ అధ్యక్షుల బాధ్యతల స్వీకారం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 12 :** తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డ్ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరియు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సీతమ్ రాజు సుధాకర్ అధ్యక్షత వహించారు.నియోజకవర్గ పరిధిలో పలు వార్డులకు ఎంపికైన నాయకులు పార్టీ పతాకం కింద ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, "పార్టీ బలోపేతం కోసం ప్రతీ స్థాయిలో సమిష్టిగా పనిచేయాలని, ప్రతి వార్డులోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని" సూచించారు.ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లుగా1వ క్లస్టర్షేక్ జుబేర్, కో-క్లస్టర్ ఓంకార్ సాయి విశాల్,2వ క్లస్టర్ దాసన్న సత్యనారాయణ, కో-క్లస్టర్ మండపాటి వెంకట సత్యభవాని,3వ క్లస్టర్ పుక్కల రాజేశ్వరి, కో-క్లస్టర్ వేణు యానగి,4వ క్లస్టర్: విల్లూరి తిరుమల, కో-క్లస్ట ర్ బంటుపల్లి శ్రీనివాసరావు,5వ క్లస్టర్ విల్లూరి భాస్కరరా వు, కో-క్లస్టర్ మున్నం బాలాజీ,6వ క్లస్టర్ వాసుపల్లి దానయ్య, కో-క్లస్టర్ ఎం. సునీత7వ క్లస్టర్ కేదారి లక్ష్మి, కో-క్లస్టర్ పెనుమల్ల వెంకట రామారెడ్డి8వ క్లస్టర్ బంగారు రవిశంకర్, కో-క్లస్టర్ కొండ చిన్న9వ క్లస్టర్ పోలిపల్లి జ్యోతి, కో-క్లస్టర్ పెంటపల్లి సత్యనారాయణ10వ క్లస్టర్ ఉరికిటి నారాయణరావు, కో-క్లస్టర్ రావి వెంకటేశ్వర్లు11వ క్లస్టర్:వానపల్లి గాయత్రి ఫణికుమారి, కో-క్లస్టర్ పల్లా నగేష్12వ క్లస్టర్: గొలగాని వీరారావు, కో-క్లస్టర్ పీతల పోలరావు

ఇక వార్డు అధ్యక్షులుగా,27వ వార్డు అల్లూరి సత్యనారాయణ రెడ్డి29వ వార్డుకందిపిల్లి సతీష్ కుమార్ 30వ వార్డు డోకర రమణ, 31వ వార్డు: బత్తిన వెంకట సత్యనవీన్ కుమార్,32వ వార్డు: దాసరి దుర్గారెడ్డి,33వ వార్డు: కర్రి నీలకంఠరావు,34వ వార్డు వాసుపల్లి రామ్‌కుమార్,35వ వార్డుబొత్స రామురెడ్డి 36వ వార్డు కోడూరు శివయ్య, 37వ వార్డు: పిల్ల తాతయ్యలు,38వ వార్డు మజ్జి త్రినాధరావు39వ వార్డు మైలపల్లి శ్రీనివాసరా వు,41వ వార్డు: ఐతి మధుబాబు తమ తమ వార్డుల్లో ప్రజా సేవకు అంకితభా వంతో పనిచే స్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంకల్పబద్ధంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దేశ రాజధాని ఢిల్లీలో 'మా తోట' ఉత్పత్తులు ప్రదర్శన

ట్రైబల్ బిజినెస్ కాన్‌క్లేవ్-2025లో అరకు కాఫీ, మిరియాలు, పసుపు, పనస, ప్రదర్శన





**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 12 :-** కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ప్రతిష్టాత్మకంగా న్యూఢిల్లీలో నిర్వహించిన ట్రైబల్ బిజినెస్ కాన్‌క్లేవ్ -2025 కార్యక్రమంలో అల్లూరి జిల్లా గిరిజన రైతుల సంఘం 'మా తోట' ఎఫ్‌పీఓ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మా తోట ఎఫ్‌పీఓ ప్రతినిధులు వనపల చిన్నారావు, దేవ్ రామ్ లక్ష్మణ్ (గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ) పాల్గొని, ఈ ప్రాంతంలో పండించే సహజ సాగు ఉత్పత్తులను ప్రదర్శించారు. ముఖ్యంగా అరకు కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం వంటి ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్‌కు విపరీతమైన స్పందన లభించింది. ఈ కాన్‌క్లేవ్‌ను భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో, సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, స్టార్టప్ ఇండియా,మరియు ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమాన్ని గిరిజన వ్యవహారాల యూనియన్ మంత్రి జ్యూయల్ ఓరం, కంట్రోలర్ జనరల్ ఉన్నత్ పి. పండిట్, మాజీ కేబినెట్ కార్యదర్శి ఎన్.ఎన్. సిన్హా, ప్రముఖ జర్నలిస్టు కరణ్ థాపర్ లు ప్రారంభించారు. మా తోట ఎఫ్‌పీఓ ప్రతినిధులు, తమ ఉత్పత్తుల విశిష్టతను వివరిస్తూ, మార్కెటింగ్ సదుపాయాలు, పారిశ్రామిక భాగస్వామ్య అవకాశాలపై వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరిపారు. సహజ సాగులో పండించే ఈ గిరిజన ఉత్పత్తుల నాణ్యతను పలువురు ప్రశంసించారని నిర్వాహకులు తెలిపారు.

# గిరిజనుల పోరాటానికి మార్గదర్శకుడు బిర్సా ముండా





విద్యార్థులతో దేశభక్తి గీతాలు
ప్రధాన ఉపాధ్యాయులు కొర్ర అర్జున్

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 12 :– కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 1 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న భగవాన్ బిర్సా ముండా జయంతి ఉత్సవాలలో భాగంగా చింతపల్లి బాలుర 2వ పాఠశాలలో బుధవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ర అర్జున్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా గిరిజనుల హక్కులు, స్వాభిమానం కోసం అహర్నిశలు పోరాడిన మహావీరుడు. ఆయన త్యాగం, పోరాటం గిరిజన సమాజంలో చైతన్యాన్ని రగిలించింది. విద్యార్థులు ఆయన ఆదర్శాలను తమ జీవితంలో ఆచరణలో పెట్టాలి అని సూచించారు. కార్యక్రమంలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం. విజయభారతి, ఎటిడబ్ల్యూవో నాగలక్ష్మి, క్లస్టర్ హెడ్‌మాస్టర్ సాగిన వీరన్న, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎస్.ఎన్. రాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందరాజు, మదర్ కళాశాల కరస్పాండెంట్ సి.హెచ్. కృష్ణకాంత్, అమరావతి కాలేజీ ప్రిన్సిపల్ నాగార్జున, బాలురు 2 హాస్టల్ వార్డెన్ గణేష్‌రావు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా జీవితం యువతకు స్ఫూర్తిదాయకం. ఆయన చూపిన మార్గం సమానత్వం, ఐక్యతకు పునాది వేసింది అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు బిర్సా ముండా జీవిత చరిత్రపై ప్రసంగాలు, నాటికలు, దేశభక్తి గీతాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు, గిరిజన సంఘ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వం కక్షతో నడుస్తోంది - మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలి






* వాసుపల్లి గణేష్ కుమార్
* భారీ ర్యాలీతో వైసీపీ శ్రేణుల ఆందోళన

విశాఖ దక్షిణం, పెన్ పవర్,నవంబర్ 12 :రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత విధానాలతో వ్యవహరిస్తోందని వైసీపీ నాయకులు, విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవా లని ఆయన డిమాండ్ చేశారు.మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వాసుపల్లి ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏవీఎన్ కళాశాల నుంచి పూర్ణ మార్కెట్ వరకు చౌట్రి ప్రాంతంలో సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంఆర్వో అందుబా టులో లేకపోవడంతో వీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వాసుపల్లి గణేష్ కుమార్ ,మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేదలకు ఉచిత వైద్యం దొరకదు. బోధన ఆసుపత్రుల్లో దయాగ్నస్టిక్ సేవలు, ఇన్‌పేషెంట్ మందులపై కూడా ఛార్జీలు విధిస్తారు. రాష్ట్రం వేల సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.
గత ఏడాది చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల 700 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయామని, 2025%–%26 విద్యా సంవత్సరానికి మరో 1,750 సీట్లు ప్రమాదంలో ఉన్నాయని తెలిపారు. మొత్తం 2,450 సీట్లు విద్యార్థులకు దక్కకుండా పోతాయని పేర్కొన్నారు.
అదే సమయంలో 1947 నుంచి 2022 వరకు కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్న రాష్ట్రంలో, మాజీ సీఎం జగన్ ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయం అని వాసుపల్లి గుర్తుచేశారు.
వైయస్ జగన్ హయాంలో ఐదు మెడికల్ కాలే జీలు పూర్తవగా, ఐదు కాలేజీలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన 10 కాలేజీల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వా టిపై దాదాపు రూ.3 వేల కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి అని వివరించారు.
ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.1,000 కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాల్లో ఈ కాలేజీలను పూర్తి చేయగలిగేది, కానీ పీపీపీ పేరుతో ప్రైవేటీ కరణ వైపు అడుగులు వేయడం ప్రజలకు అన్యాయం అని ఆయన మండిపడ్డారు.ప్రభుత్వం ఈ ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకో వాలి. నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను పూర్తిచేసి, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలి" అని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్రాధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యు లు కోలా గురువులు, దక్షిణ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ





జిల్లా వైద్యాధికారి డా. కృష్ణమూర్తి నాయక్

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 12 :- చింతపల్లి మండలం తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. డి. కృష్ణమూర్తి నాయక్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వార్డులు, ప్రసూతి గదులు, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించి పీహెచ్‌సీ పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా గమనించారు. డా. కృష్ణమూర్తి నాయక్ మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలను ప్రసవానికి వారం రోజుల ముందుగా వసతి గృహాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. పీహెచ్‌సీలో సుఖప్రసవాలు అధికంగా జరగాలని, తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధినిరోధక టీకాలు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. శీతాకాలంలో న్యుమోనియా వ్యాధి వ్యాప్తి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన ఆదేశించారు.తదుపరి ల్యాబ్‌ను పరిశీలించిన వైద్యాధికారి, రోజువారీ రక్తపరీక్షల రికార్డులు, మలేరియా కేసుల వివరాలు, రోగులకు అందించిన చికిత్సలను సమీక్షించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి సాధారణ వ్యాధుల మందులు, వ్యాధినిరోధక టీకాలు, కుక్కకాటు, పాముకాటు వ్యాక్సిన్లు సరిపడా నిల్వలో ఉంచాలని ఫార్మసిస్టును ఆదేశించారు. అలాగే కాలం చెల్లిన మందులను మరియు వైద్య వ్యర్థాలను కేటాయించిన ప్రదేశంలోనే ఖననం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించి మొత్తం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో పీహెచ్‌సీ వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తపాలా శాఖ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ పోటీలు

విశాఖ పెన్ పవర్ నవంబర్ 1240వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోస్ట్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసి, విశాఖపట్నంలోని %వీఎ% కాలనీని చెందిన %ా%3 స్పోర్ట్స్ అరీనా 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని 14 పోస్టల్ సర్కిల్స్ నుండి 129 ఉత్సాహభరితమైన క్రీడాకారులు పాల్గొన్నారు
మిక్సిడ్ ఈవెంట్ మరియు ఉమెన్స్ డబ్స్ ఈవెంట్లో టీమ్లు అద్భుతమైన ప్రదర్శనలు చూపించాయి.
మిక్సిడ్ క్వార్టర్ ఫైనల్లో :
పౌలమి దాస్ %డ% ఆకాశ్ (వెస్ట్ బెంగాల్) వారు భూమిన్ %డ% సోనల్బెన్ (గుజరాత్) (3-0) మొదటి క్వార్టర్ ఫైనల్లో ఓడించారు.
సైలా నూర్ బాషా మరియు భరద్వాజ్ బాబు (ఆంధ్రప్రదేశ్) వారు పవన్ కుమార్ మరియు అనూప (తెలంగాణ) ను (3-2) రెండవ క్వార్టర్ ఫైనల్లో ఓడించారు.
సాయాని బోస్ మరియు ప్రతీక్ రాయి (వెస్ట్ బెంగాల్) వారు సెంటూర్ పాండే మరియు ఏ రమేష్ (తమిళనాడు) ను (3-0) వాలా మూడవ క్వార్టర్ ఫైనల్లో ఓడించారు.గుజరాత్ నుండి వి.బి. వాలా మరియు దివ్యా గోయల్ వారు పశ్చిమ బెంగాల్ నుండి సంగీత మరియు గౌరవ్ ను నాలుగవ క్వార్టర్ ఫైనల్లో (3-1) ఓడించారు.
మిక్సిడ్ డబుల్స్ సెమీఫైనల్:



పశ్చిమ బెంగాల్ నుండి పౌలామి దాస్ మరియు ఆకాశ్ వారు ఆంధ్ర ప్రదేశ్ నుండి సైలా నూర్ బాషా మరియు భరద్వాజ్ బాబు ని మొదటి సెమీఫైనల్లో (3-1) ఓడించారు.
గుజరాత్ నుండి వి.బి.వాలా మరియు దివ్యా గోయల్ వారు పశ్చిమ బెంగాల్ నుండి సయాని బోస్ మరియు ప్రతీక్ రాయ్ ని రెండవ సెమీఫైనల్లో (3-1) ఓడించారు.
ఉమెన్స్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్:
పశ్చిమ బెంగాల్ నుండి సయాని మరియు సంగీత వారు మహారాష్ట్ర నుండి వైశాలి మరియు దీపాలి ని మొదటి క్వార్టర్ ఫైనల్లో (3-0) ఓడించారు గుజరాత్ నుండి దివ్యా గోయల్ మరియు ప్రసన్నా వారు గుజరాత్ నుండి ఎస్. కె. జోషి మరియు అవని భట్ ని రెండవ క్వార్టర్ ఫైనల్లో (3-0) ఓడించారు.



పశ్చిమ బెంగాల్ నుండి పౌలామి దాస్ మరియు సోమాలి వారు ఉత్తరప్రదేశ్ నుండి వినీతా మరియు నుపూర్ ను మూడవ క్వార్టర్ ఫైనల్లో (3-0) ఓడించారు.ఆంధ్ర ప్రదేశ్ నుండి శ్రీ లక్ష్మి మరియు సైలా నూర్ బాషా వారు ఛత్తీస్గఢ్ నుండి స్వేతా మరియు పాయల్ ను నాలుగవ క్వార్టర్ ఫైనల్లో (3-0) ఓడించారు.
ఈ కార్యక్రమం నవంబర్ 14, 2025 వరకు కొనసాగించి ఫైనల్లతో మరియు వాలిడిక్టరీ కార్యక్రమంతో ముగుస్తుంది.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ ప్రవేశం కొత్తూరు పంచాయితీ బెడ్డగుడ గ్రామంలో%ఎ% ఘనంగా నిర్వహించిన

* అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు





అనంతగిరి నవంబర్ 12. పెన్ పవర్ తహసీల్దార్ జడ్పీటీసీ దీసరి గంగరాజు విలేకర్ల సమక్షంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ ప్రవేశాలు రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల గృహాలు నిర్మాణం జరుగుతుండగా నేడు రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల గృహ ప్రవేశాలు జరిగాయని మండలంలో కొత్తూరు పంచాయితీ బెడ్డగుడ గ్రామంలో 11మంది పీవీటిజి కుటుంబాలకు నూతననూతనగృహాలు మంజూరు కాగా బురిడీ భాగ్యవతి, నూతన గృహం పూర్తి కావడంతో గృహ ప్రవేశం లాంచనంగా నిర్వహించడం జరిగిందని, ప్రభుత్వంరెండు లక్షల ముప్పై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే దపాల వారిగా ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని,
గిరిజన సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులు అందరూ కలిసి 5 లక్షలు పెంచాలని పోరాటం చేయడంతో లక్ష రూపాయలు పెంచినట్టు ప్రభుత్వం ప్రకటించిందని, పేమెంట్ వేయ దానికి మాత్రం కార్యాచరణ లేదని,
ప్రభుత్వం పీవీటిజి గిరిజన కుటుంబాలకు 5 లక్షలు పెంచాలని కూటమి ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ పట్నం ఎంపిటిసి మూతిబోయిన. సన్యాసిరావు,తామల రాంబాబు వైసిపి నాయకుడు బి. గంగులు పీసా కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటరావు. మండల తాహశీల్దార్ వీరభద్రరావు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భీమిలిలో భారీ ర్యాలీ

తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం అందజేసిన వైఎస్ఆర్సీపీ నాయకులు





భీమిలి, పెన్ పవర్, నవంబర్ 12 :రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న మెడికల్ కాలేజీలను రక్షించండి ఉద్యమం భాగంగా, భీమిలి నియోజకవర్గంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభు త్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరే కంగా ప్రజా వైద్య హక్కులను కాపాడాలనే నినాదాలతో భీమిలి తగరపువలస ఫుట్‌బాల్ మైదానం నుండి భీమిలి ఆర్వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.
ఈ ర్యాలీలో విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్ఆర్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను తన కుమార్తె సిరి మ్మ మరియు ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, ప్రజా వైద్యం ప్రజల మౌలిక హక్కు అని గుర్తు చేశారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం కాలంలో రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టగా, అందులో ఏడింటిని పూర్తి చేసి ఐదు కళాశాలలను ప్రారంభించాం. మిగతా కళాశాలలు కూడా వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పన్నీ ప్రైవేటు రంగానికి అప్పగించడానికి ప్రయత్నిస్తోంది, అని ఆయన అన్నారు.తదుపరి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సంవత్సరానికి వెయ్యి కోట్లు వెచ్చించి ఐదు సంవత్సరాల్లో ఈ కళాశాలలను పూర్తి చేయగలదు. కానీ ప్రైవేటు పరచడం ప్రజలకు వైద్యం అందకుండా చేయడమే. జాతీయ వైద్య మండలి రాష్ట్రానికి కేటాయించిన వైద్య సీట్లను ప్రభుత్వం తిరస్కరించడం అత్యంత దురదృ ష్టకరం, అని విమర్శించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన దారిలో నడుస్తూ గత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పేదలకు అందించే దుకు కృషి చేసిందని ఆయన తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశలో వెనుకడుగు వేస్తోందని చిన్న శ్రీను గారు ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఎస్ఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీ సీలు, సోషల్ మీడియా కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు వాదా లకుంట విద్యార్థులు-విజయ్ కుమార్



**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 12**
రాష్ట్రస్థాయి పుట్ బాల్ పోటీలకు మండలంలోని వాదాలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ తెలిపారు.
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫుట్ బాల్ అండర్ 14,17 బాల బాలికల పోటీలు పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవరపల్లిలో జరిగాయి అన్నారు. ఈ పోటీలలో వాదాలకుంట జిల్లా పరిషత్ హై స్కూల్ చెందిన 9 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ తెలిపారు. అండర్ 14 విభాగం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు చిత్తూరు జిల్లా పుంగనూరులో , అండర్ 17 విభాగంలో ఎంపికైన వారు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లోవిజేతగా నిలిచిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనతొమ్మిది మంది విద్యార్థిని విద్యార్థులను వారికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఓం ఫణినీ ఉపాధ్యాయులు జగదీష్ ,సురేష్, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

# స్కూల్ విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 12:**పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలోని పెంటపాడు మండలం చింతపల్లి గ్రామంలో పల్లెబాట కార్యక్రమం సందర్భంగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వివిధ అర్జీలను స్వీకరించారు.
ఈ సందర్భంగా చింతపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినిలు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలసి, తాము ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం కాశిపాడు గ్రామంలోని మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుకుంటున్నామని, అక్కడ భోజన నాణ్యత సరిగా లేదని ఫిర్యాదు చేశారు.
విద్యార్థినిల సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజుతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేశారు. గురువారం నుండి ఆయా పాఠశాలలకు వెంకటరమణగూడెంలో గల భారతీయ విద్యా భవన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుండి మధుర అన్నం పంపించవలసిందిగా ఆదేశాలు జారీ చేయించారు.
ఈ చర్యతో విద్యార్థినిల సమస్యకు వెంటనే పరిష్కారం లభించింది. కార్యక్రమంలో పెంటపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి, గ్రామ సర్పంచ్, మండల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు యర్రంశెట్టి సత్యనారాయణ కన్నుమూత.



కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 12: వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు,కే గంగవరం మండలం ఊడిముడి గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి సత్యనారాయణ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలిసి స్థానికంగా శోకసంద్రం నెలకొంది. రామచంద్రపురం వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, యర్రంశెట్టి సత్యనారాయణ భౌతిక దేహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సాంత్వన తెలిపారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

# విశాఖలో సీఎం ఘన రాక సమ్మిట్ సన్నాహకాలకు ఊపుఇచ్చిన నేతలు





సిఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్ కోసం నగరానికి రాక

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 12.** :విశాఖ జిల్లాలో నిర్వహించనున్న సిఐఐ పార్ట్నర్‌షిప్ సమ్మిట్%-%2025 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బుధవారం సాయంత్రం వాయుమార్గం ద్వారా నగరానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.
ముఖ్యమంత్రిని ఆత్మీయంగా ఆహ్వానించిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగల పూడి అనిత, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యుడు ఎం. భరత్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివా సరావు, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, అలాగే వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.
జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిష నర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ గోపాల్ తదితర అధికారులు పుష్పగు చ్ఛాలు అందజేసి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

# అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

దేవరపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రజాప్రతినిధి



**రావులపాలెం పెన్ పవర్ నవంబర్ 12:** రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో పట్టా రాంబాబుకు చెందిన పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో కుటుంబానికి భారీ నష్టం జరిగింది.బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం దేవరపల్లికి చేరుకున్నారు. ఆయన బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం బస్తా, ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు.ఇంటి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామ ప్రజలు, కార్యకర్తలు ఎమ్మెల్యే స్పందనను అభినందించారు.

# పంట కోత ప్రయోగం దిగుబడి అంచనా వేయొచ్చు-ఏసుబాబు



**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 12:**పంట కోత ప్రయోగంతో దేశ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను అంచనా వేయవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఏసుబాబు అన్నారు. గోపాలపురానికి చెందిన చెరకు రైతు కుప్పాల శ్రీనివాసరెడ్డి పొలంలో బుదవారం వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఏసుబాబు మాట్లాడుతూ పంట కోత ప్రయోగం చేయడం ద్వారా చెరకులో 2003 వి 46 అనే రకం పంట కోత ప్రయోగంతో ఎకరాకి 34 టన్నులు దిగుబడి వస్తుందని అన్నారు. మండలంలో 48 వరి కోత ప్రయోగాలు , చెరకు 6, మినుము 6 పంట కోత ప్రయోగాలు చేయడం జరిగిందన్నారు. రైతులు పంట కోత ప్రయోగాలకు సంబంధించి సూచనలు సలహాలు కావాల్సి వస్తే వ్యవసాయ శాఖ అధికారులు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జోడాల.వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఉప గణాంకధికారిణీ జయ భారతి, వ్యవసాయ సహాయకులు సత్తార్ జానీ, రాజు తదితరులు ఉన్నారు

# న్యుమోనియా వ్యాధి పై అవగాహన



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్12:**ప్రపంచ న్యుమోనియా దినోత్సవ సందర్భంగా మాచవరం సచివాలయం-4 లో తల్లిదండ్రులకు న్యుమోనియా, పిసివి క్లీనిక్ పై అవగాహన కల్పించారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు టీకాలు అయిదు సం.లలోపు పిల్లల తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు. అయిదు సంవత్సరాల తక్కువ వయస్సు ఉన్నవారికి న్యుమోనియా వ్యాధి బారనపడుతున్నారని ఎమ్.పిడివో. మమత అన్నారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వం న్యుమోనియా వ్యాధి నివరణ చర్యలు చేపడుతూ అవగాహన కల్పించి నివారణ చికిత్స చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఏడాది నవంబర్ 12 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ప్రచారం నిర్వహిచడం జరుగుతుందని సిహెచ్ వో బి. అప్పారావు వివరించారు. ఈ కార్యక్రమం లోఎం. అర్జమ్మ, ఏఎన్ ఎం, ఆశాలు పాల్గొన్నారు

# సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

77 మందికి గృహ మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి సుభాష్






**రామచంద్రపురం, నవంబర్ 12 పెన్ పవర్:**పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయంలో పీఎంఏవై అర్బన్ పథకం కింద లబ్ధిదారులైన 77 మందికి గృహ మంజూరు పత్రాలను మంత్రి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఆర్డీవో అఖిల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ“2029 నాటికి రాష్ట్రంలో గృహాలు లేని కుటుంబం ఉండకూడదనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. పేదవారికి సొంత గృహాలు కల్పించడం ప్రభుత్వ ధ్యేయం,” అన్నారు.గృహ నిర్మాణానికి గాను రూ. 2.50 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గృహ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, మంత్రి సుభాష్‌కు మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎం.వి. నరసింహారావు, ఈఈ వెంకటరమణ, డీఈ రాంబాబు, ఆర్డీవో అఖిల, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షుడు చందమామ వాసు, గరికపాటి సూర్యనారాయణ, మేడిశెట్టి సూర్యనారాయణ, కట్ట నాగేశ్వరరావు, కంచుమర్తి బాబురావు, నారపురెడ్డి బలరాం, బళ్ళ శివ, అల్లం శ్రీను, బరకాటి రాంబాబు, పొనగల చంటి, పుల్లల దత్తాత్రేయ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. పేదవారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేదవాడు సొంత ఇంటి తలుపులు తెరవగల రోజు దూరం లేదని మంత్రి సుభాష్ నమ్మకం వ్యక్తం చేశారు.

# కోటలో కోటరీ...

**కడప నవంబర్ 12 పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కోటరీ నుంచి బయటకు రాలేదని పిస్తుంది. కేవలం పదకొండు సీట్లకే పరిమితమయినప్పటికీ జగన్ మాత్రం అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరునే అవలంబిస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. ఏ నిర్ణయం తీసుకున్నా తప్పని సరి పరిస్థితుల్లో అమాత్యుల నుంచి నేతల వరకూ తలూపి ఉండవచ్చు. పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి కోఆర్డినేటర్ల నియామకం నుంచి నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాల వరకూ ఏ మాత్రం పరిష్కారానికి జగన్ చొరవ చూపలేదు.అది కూడా వైసీపీ ఓటమికి ఒక కారణమని చెప్పక తప్పదు. కేవలం కోటరీ నేతల నివేదికలపైనే ఆధారపడి పార్టీని నడిపారు. ఒక రకంగా పార్టీని అసలు పూర్తిగా పట్టించుకోలేదు. తాను ప్రభుత్వంలో ఉన్న ఐదేళ్ల పాటు మళ్లీ అధికారంలోకి తనవల్లే రావాలని అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్లారు. కానీ ఆ ప్రయోగం బూమ్ రాంగ్ అయింది. అధికారం కోల్పోయిన తర్వాత ఆయనలో మార్పు వస్తుందని భావించిన నేతలకు నిరాశే ఎదురవుతుంది. ఎందుకంటే రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేతలకు, ద్వితీయ శ్రేణి నేతలకు మధ్య గ్యాప్ ఇంకా కొనసాగుతుంది. వాటిని పరిష్కరించేందుకు మాత్రం జగన్ చొరవ చూపడం లేదు. కనీసం జిల్లాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి ముఖ్య నేతలను పక్కన పెట్టి ద్వితీయ శ్రేణి నేతల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదుఇప్పటికీ కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొందరి ఆధిపత్యమే పార్టీలో నడుస్తుంది. పార్టీకేంద్ర కార్యాలయంలోనూ కోటరీ పెత్తనం ఇంకా కనిపిస్తుంది. ఇప్పటికీ జగన్ వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్న అభిప్రాయం వినిపిస్తుంది. దీంతో నేతలు కూడా జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చినప్పటికీ నేతలు వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయడంలేదు. వచ్చినా కోటరీ అడ్డుకుంటుందని భావించి వారు తమ నియోజకవర్గాల్లో మౌనంగా ఉన్నారు. ఇప్పటికైనా జగన్ సరైన నిర్ణయం తీసుకోకుంటే పార్టీ ఎదుగుదల అనేది జరగదన్నది సుస్పష్టం.

# టీడీపీలో కొత్త నీరు.. పాతనీరు

**నెల్లూరు, నవంబర్ 12 పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీకి అంతకు ముందు లేని సమస్య ఇప్పుడు రావడానికి ప్రధాన కారణం ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. గత ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నేతలకు టిక్కెట్లను ఇచ్చి తెలుగుదేశం పార్టీ నాయకత్వం బరిలోకి దింపింది. ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చిన నేతలు ఎక్కువ మందికి టిక్కెట్లు ఇచ్చిన వారిలో ఉన్నారు. అయితే వారికి, కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న వారికి మధ్య గ్యాప్ పెరిగింది. ఇతర పార్టీల నుంచి వచ్చి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు స్థానిక టీడీపీ నేతలను దగ్గరకు తీసుకోవడం లేదు. తమకు తాము ప్రత్యేకంగా ఒక టీం ను ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు. అంటే పాత టీడీపీ నేతలపై వారికి నమ్మకం లేకనే ఈ మధ్య అనేక వివాదాలకు కారణమయింది. తంబళ్లపల్లి నకిలీ మద్యంకేసు దగ్గర నుంచి కావలి నియోజకవర్గం రగడ వరకూ అదే సమస్య. ఎందుకు ఇతర పార్టీల నేతలను పార్టీలోకి చేర్చుకోవాలి? నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న టీడీపీకి పోటీ చేసే నేతలు లేరా? అన్న ప్రశ్న తెలుగు తమ్ముళ్లలో వ్యక్తమవుతుంది. కేవలం ఆర్థికంగానూ, సామాజికపరంగానూ లెక్కలు వేసుకుని ఇతర పార్టీల నేతలకు గాలం వేసి మరీ పార్టీ కండువాలు కప్పేసి వారికే బీఫారాలు ఇస్తే ఇక తాము దశాబ్దాలుగా పడిన కష్టాలకు ప్రతిఫలిం ఏముంటుందని కొందరు నేతలు ఆఫ్ ది రికార్డుగా ప్రశ్నిస్తున్నారు. గెలిచిన తర్వాత తమను చులకన చేసి చూడటం, తమను వేగులుగా భావించి దగ్గరకు రానివ్వకపోవడం వంటి వాటిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు టీడీపీ నేతలు నేరుగా నారా లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. . కావలి టీడీపీ నేత సుబ్బనాయుడు మృతి తర్వాత జరిగిన ఘటనలు చూస్తే ఇదే అర్థమవుతుంది. సుబ్బనాయుడు మృతి పట్ల నెల్లూరు జిల్లాలోని నేతలు సీరియస్ గా స్పందించాల్సిన సమయంలో వారు మౌనంగా ఉండటంతో పాటు ఆయన అంత్యక్రియలకు పార్లమెంటు సభ్యుడు, చాలా మంది ఎమ్మెల్యేలు డుమ్మాకొట్టడం కూడా పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే ఇటీవల కావలి నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్ దగదర్తి వెళ్లి సుబ్బనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కావలి టీడీపీలో తలెత్తిన విభేదాలను పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి బాధ్యతను అప్పగించారు. అయితే వేమిరెడ్డికి, కావ్య కృష్ణారెడ్డికి కూడా పొసగదని అంటున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని అనేక నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల డామినేషన్ పెరిగిపోవడంతో టీడీపీ ఒరిజనల్ నేతలు ఇబ్బందులు పడుతున్నారు. మరి దీనికి పార్టీ నాయకత్వం ఏ రకమైన పరిష్కారం చూపుతుందన్నది చూడాలి.

# కంటికి కునుకు లేకుండా చేస్తున్న 22ఏ

**కాకినాడ, నవంబర్ 12 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో 22A సమస్య లక్షల మంది ఏపీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 1977లో అమలు చేసిన ఏపీ అసైన్డ్ ల్యాండ్ చట్టం కింద పేదలు, భూమి లేని కుటుంబాలకు కేటాయించిన 35.4 లక్ష ఎకరాల భూములు ఇప్పటికీ వివాదాల్లోనే ఉన్నాయి. ఈ భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా, ట్రాన్స్‌ఫర్ చేయకుండా 22A లిస్ట్‌లో ఉంచడం వల్ల లక్షలాది మంది రైతులు, కుటుంబాలు ఆర్థిక నష్టాలు, సామాజిక అస్థిరత్వానికి గురవుతున్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం పరిష్కారాలు ప్రకటించినప్పటికీ, మార్చి 2025 నుంచి జూన్ 2026 వరకు విస్తరించిన ఆలస్యం ప్రజల అసంతృప్తిని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22A భూముల సమస్యలు అసైన్డ్ చట్టం అమలు తీరుతో ప్రారంభమయ్యాయి. ఈ చట్టం ప్రకారం, SC/ST, BC, మైనారిటీలు, భూమిలేని పేదలకు కేటాయించిన భూములను ట్రాన్స్‌ఫర్ చేయకూడదని నిబంధనలు విధించారు. ఈ భూములు 'ప్రొటెక్టెడ్' గా ఉండాలని ఉద్దేశ్యం. కానీ భూములు పొందిన అనేక మంది వాటిని అమ్ముకోవడం, బదలాయించడం చేశారు. అలాగే రికార్డుల ఫ్రాడ్ వల్ల డాటెడ్ ల్యాండ్స్ గా మారాయి. వైఎస్ఆర్సీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా 22%ను అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో సమస్య తీవ్రం అయింది. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి కాలనీ.. ప్రతి భూమిపై 22%ఖ% అమలు చేశారు. కొన్ని చోట్ల ఆయా కాలనీల వాసుల వద్ద ప్రభుత్వం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసింది. అంటే..అధికారికంగా అమ్మేసింది. గుంటూరులోని నల్లకుంటగా పిలిచే లక్ష్మీరఘురామయ్య నగర్ ఒకప్పుడు పేదలకు ప్రభుత్వం చిన్న చిన్న స్థలాల రూపంలో ఇచ్చింది. తర్వాత వాటిని నామినల్ ధరకు వారికి అమ్మకపు రిజిస్ట్రేషన్ చేసింది.కానీ వైసీపీ హయాంలో ఈ కాలనీని కూడా 22a కిందకు తెచ్చారు. ఈ కారణంగా ప్రజలు ఆస్తి ఉన్నా..దాన్ని బదలాయించుకోలేకపోతున్నారు. అదే సమయంలో రాజకీయకక్షలు తీర్చుకోవడానికి కూడా ఈ చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే తమకు కావాల్సిన భూములకు మాత్రం ఫ్రీహోల్డ్ ఇచ్చి భూముల్ని కొట్టేసే కుట్ర చేశారన్న ఆరోపణలు రావడంతో 2024లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వా 20 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ విధించారు. మొత్తం అవకతవకలపై విచారణ జరుపుతున్నారు. ఈ సమస్యలు రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలను బాధిస్తున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో లక్షలాది అప్లికేషన్లు CCLA కు వచ్చాయి. SC/ST కమ్యూనిటీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు, ఎందుకంటే ఈ భూములు వారి జీవనాధారం. 2025 జూలైలో రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశించడంతో సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తూ అలసిపోతున్నారు. ప్రస్తుత రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ జనవరి 2025లో 22A బ్యాన్ లిఫ్ట్ చేస్తామని ప్రకటించారు. డిస్ట్రిక్ట్ కలెక్టర్లకు మూడు రోజుల్లో రిపోర్ట్ సమర్పించమని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 25, 2025న మంత్రి "ప్రైవేట్ ల్యాండ్స్‌ను 22A లిస్ట్ నుంచి తొలగించమని" కలెక్టర్లకు సూచించారు. యాక్ట్‌లో అప్పీల్ అథారిటీని ఆర్డీఎలకు మార్చి, డిస్ప్యూట్ రిసాల్వ్ చేయడానికి వేగం తీసుకురావాలని చెప్పారు. తర్వాత డిస్ట్రిక్ట్-లెవల్ అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 16, 2025లో మార్చి నుంచి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రామిస్ చేశారు. కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. భూ సమస్యల పరిష్కారం అంత తేలిక కాదు. కానీ పరిష్కారం అసాధ్యం వైసీపీ హయాంలో జరిగిన అవకతవకల ఇన్వేస్టిగేషన్ కు అధిక సమయం పడుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ల్యాండ్ రీ-సర్వేలు, డిస్ట్రిక్ట్ కమిటీల ఏర్పాటు %-% జనవరి 20, 2025 నుంచి రీ-సర్వే ప్రారంభించారు, కానీ పూర్తి అమలుకు 4-6 నెలలు పడుతుందని అంటున్నారు. కానీ ఎప్పటికప్పుడు త్వరలో అంటున్నారు కానీ.., పరిష్కారం దిశగా ఆలోచనలు చేయడం లేదు. GoM రికమెండేషన్లు, డిజిటల్ రికార్డులు భూ-రక్ష వంటివి ద్వారా త్వరిత పరిష్కారం సాధ్యమేనని ప్రభుత్వానికి చిత్తశుద్ధే ఉండాలని అంటున్నారు. మరి ప్రభుత్వం ఆలకిస్తుందా ? ప్రభుత్వాలే సృష్టించిన పేదల కష్టాలు తీరుస్తుందా?

# వైఎస్ జగన్ బ్యాక్ స్టెప్...

**విజయవాడ, నవంబర్ 12, పెన్ పవర్:**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ సీబీఐ కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యక్తిగత మినహాయింపు కోరుతూ జగన్ సీబీఐ కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాంపల్లి సీబీఐ కోర్టు వైఎస్ జగన్ పిటిషన్ విచారించి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలపటంతో వైఎస్ జగన్ కోర్టు ఎదుట హాజరు కానున్నట్లు సమాచారం. ఆయన తరుపు న్యాయవాదులు వారం రోజులు సమయం కోరగా.. నవంబర్ 21వ తేదీ వరకూ సీబీఐ కోర్టు సమయం ఇచ్చింది.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీబీఐ కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కానున్నారు. నవంబర్ 21లోగా నాంపల్లిలోని సీబీఐ కోర్టులో వైఎస్ జగన్ వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు వైఎస్ జగన్ సీబీఐ కోర్టుకు తెలియజేశారు. వైఎస్ జగన్ ఇటీవల యూరప్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే యూరప్ పర్యటన పూర్తై వచ్చిన తర్వాత నవంబర్ 14వ తేదీలోగా కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సీబీఐ కోర్టు వైఎస్ జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలంటూ వైఎస్ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేసింది.దీంతో కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు సమయం ఇవ్వాలని వైఎస్ జగన్ తరుఫున ఆయన న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21 వరకు సమయం ఇస్తూ సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆలోపు వైఎస్ జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అక్టోబర్ నెలలో వైఎస్ జగన్ లండన్ పర్యటనకు వెళ్లారు. లండన్ పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ



అంతకుముందే సీబీఐ కోర్టును కోరారు. ఈ వినతిని పరిశీలించిన సీబీఐ కోర్టు.. షరతులతో జగన్ లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చింది. పర్యటన పూర్తైన తర్వాత నవంబర్14వ తేదీలోగా వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది.అయితే లండన్ పర్యటన నుంచి వచ్చిన అనంతరం వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు హాజరయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని.. ఇది ప్రభుత్వ యంత్రాంగానికి భారమని పిటిషన్‌లో జగన్ పేర్కొన్నారు. వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ వేశారు.వైఎస్ జగన్ పిటిషన్ మీద విచారణ జరిపిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై కేంద్ర దర్యాప్తు సంస్థ అభ్యంతరాలు తెలియజేయటంతో.. వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు గడువు కావాలని జగన్ తరుపు న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21వ తేదీ వరకూ గడువు ఇస్తూ సీబీఐ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది . మరి నవంబర్ 21లోపు వైఎస్ జగన్ సీబీఐ కోర్టులో హాజరవుతారా లేదా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# నాలుగున్నర గంటల్లో తిరుపతి




**విజయవాడ, నవంబర్ 12, ( పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేశాఖ శుభవార్త అందించింది. ఏపీలో మరో వందే భారత్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ నెలాఖరు నుంచి విజయవాడ బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి ఇప్పటికే షెడ్యూల్, రూట్ మ్యాప్ ఖరారు చేశారు. ఈ రైలు వారంలో మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ రైలు అందుబాటులోకి వస్తే విజయవాడ నుంచి తిరుపతికి కేవలం నాలుగున్నర గంటల్లో చేరుకోవచ్చని రైల్వే అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి త్వరలోనే మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రానుంది. రైల్వే శాఖఏపీకి మరో వందే భారత్ రైలును మంజూరు చేసింది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న విజయవాడ%-%బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ నెలాఖరుకు పట్టాలు ఎక్కనుంది. విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు సంబంధించిన.. రూట్ మ్యాప్, షెడ్యూల్ రైల్వేశాఖ తాజాగా ఖరారు చేసింది. విజయవాడ - బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. మంగళవారం మినహా వారంలో అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. ఈ వందేభారత్ రైలు ద్వారావిజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోపేచేరుకోవచ్చు. విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు తెనాలి, ఒంగోలు, నెల్లూరు రైల్వేస్టేషన్, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, కృష్ణరాజపురం రైల్వేస్టేషన్‌లలో హాల్ట్ సౌకర్యం కల్పించారు.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో మొత్తం 8 బోగీలు ఉంటాయి. 7 ఏసీ చైర్‌కార్ బోగీలు ఉంటే.. ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ బోగీ ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు 20711 నంబరుతో అందుబాటులో ఉంటుంది. ఈ రైలు ప్రతి రోజూ ఉదయం 5 గంటల 15 నిమిషాలకు విజయవాడలోబ యలుదేరుతుంది. మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాలకు బెంగళూరు రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. 20712 నంబరుతో బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు.. బెంగళూరులో మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు బయల్దేరుతుంది. రాత్రి 11.45 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే తిరుపతికి వెళ్లేవారికి సౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా విజయవాడ వైపు నుంచి తిరుపతి వెళ్లేవారికి ఈ రైలు అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే.. కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి తిరుపతికి చేరుకోవచ్చు. అయితే ముందే చెప్పుకున్నట్లుగా ఈ రైలు మంగళవారం మినహా వారంలో మిగతా అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరితే.. ఉదయం 9.45గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.ఇక బెంగళూరు విజయవాడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. సాయంత్రం 6.55గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రాత్రి 11 గంటల 45 నిమిషాలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.మరోవైపు విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు ఇప్పటి వరకూ కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉంది. ఈ రైలు వారంలో కేవలం మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# టీడీపీలో ఆ ఎమ్మెల్యేలపై చర్యలే....

**విజయవాడ, నవంబర్ 12 పెన్ పవర్:** ప్రత్యర్థులే కాదు.. సొంత వారి చర్యలపై దృష్టి పెట్టి ఉండాలంటారు పెద్దలు. ఎందుకంటే తమ వెంటే ఉండి తప్పులు చేసిన వారు ఉంటారు. అటువంటి వారితో చెడ్డ పేరు రావడం ఖాయం. ఇప్పుడు ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ జాగ్రత్తలు పడుతున్నారు. వరుసగా వారు చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు కూటమిలో వస్తున్న మార్పులను తెలియజేస్తోంది. రానున్న కాలంలో సంక్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయని గ్రహించి ముందుగానే వారు ఇప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పనిచేయని ఎమ్మెల్యేలను క్లాస్ పీకుతున్నారు. సొంత చరిష్మాతో గెలిచాం అనుకుంటున్న ఎమ్మెల్యేలు బయటకు వెళ్ళిపోవచ్చు అని చంద్రబాబు సూచించారు. తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు చాలామంది వ్యవహార శైలి బాగాలేదని.. అటువంటివారు పనితీరు మార్చుకోవాలని లోకేష్ హెచ్చరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అవకాశం ఇస్తే.. వారి నమ్మకాన్ని వమ్ము చేసుకోకూడదని పవన్ కళ్యాణ్ గట్టిగానే ఎమ్మెల్యేలకు హెచ్చరికలు పంపారు. తద్వారా మున్ముందు గట్టి మార్పులే ఉంటాయని సంకేతాలు పంపారు.చంద్రబాబుతో పాటు పవన్ రెక్కల కష్టంపై కూటమి అధికారంలోకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత తోడు వీరి కృషి ఉంది. ఆపై లోకేష్ పట్టుదల కూడా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ఎమ్మెల్యేల పనితీరుతో చెడ్డ పేరు వస్తుందని నేరుగా



గ్రహించారు. ముఖ్యంగా టిడిపిలో పరిస్థితి చేయి దాటుతుందన్న అనుమానాలు ఉన్నాయి. 1995లో పార్టీ బాధ్యతలు తీసుకున్నారు చంద్రబాబు. చాలామంది తటస్థులను సైతం రాజకీయాల్లోకి తీసుకొచ్చి అవకాశాలు కల్పించారు. దాని ద్వారా ఆయనకు రాజకీయ ప్రయోజనం దక్కిందే కానీ.. ఇప్పటిలా ఇబ్బందులు ఎదురు కాలేదు. కూటమి ప్రభంజనంలో వైసీపీ బలమైన నియోజకవర్గాలను సైతం చాలామంది అలవోకగా గెలవగలిగారు. అయితే అటువంటి వారు తమ సొంత చరిష్మాతో గెలిచామని భావిస్తున్నారు. వారితోనే ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. టిడిపి ఎమ్మెల్యేల పనితీరు ప్రభావం కూటమిపై పడుతోంది. చంద్రబాబులో అదే కలవరం.మూడు దశాబ్దాలుగా పార్టీ బాధ్యతలు చూస్తున్నారు చంద్రబాబు. అధికారంలో ఉన్నారు. విపక్షంలో సైతం కొనసాగారు. కానీ ఈసారి విచిత్రంగా కొత్తవారు గెలిచారు. అటువంటి వారి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలా బయటపడాలో కూడా చంద్రబాబుకు తెలియడం లేదు. కొలికపూడి శ్రీనివాసరావు, బొజ్జల సుధీర్ రెడ్డి, రెడ్డప్ప గారి మాధవి, కావ్య కృష్ణారెడ్డి, జయ చంద్రారెడ్డి వంటి వారితో ఎప్పటికప్పుడు ఇబ్బందులు వస్తూ వచ్చాయి. ఇలానే వదిలేస్తే తెలుగుదేశం పార్టీతో పాటు కూటమికి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే చంద్రబాబు ఎలా గాడిలో పెట్టాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే వివాదాస్పద ఎమ్మెల్యేల చుట్టూ ఇప్పుడు టిడిపి అనుకూల మీడియా వాచ్ ఉంటుంది. ఆపై నిఘా వర్గాలు కూడా ఉంటాయి. అటువంటి ఎమ్మెల్యేలను వదులుకోవాలంటే.. వారిపై ఒక రకమైన ముద్ర వేసి విడిచి పెడతారు. రాజకీయాల్లో రాణించలేని పరిస్థితి ఉంటుంది. అదే విషయాన్ని ఈ ఎమ్మెల్యేలకు చెబుతోంది అత్యున్నత కమిటీ. వివాదాస్పద ఎమ్మెల్యేల తీరు రోజురోజుకు జఠిలం అవుతున్న తరుణంలో.. ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. మారుతారా? మారరా? మారకపోతే ఇన్ని ఇబ్బందులు ఉంటాయి? ఇది ఇబ్బందులు పడాల్సి ఉంటుంది అంటూ ఆ కమిటీ స్పష్టం చేస్తుంది. వినకపోతే వారి విషయంలో సీరియస్ యాక్షన్ మొదలు అవుతుంది.

# సిరాజ్ స్ఫూర్తితో టీమిండియాలోకి వస్తా.. భారత అండర్-19 జట్టులో హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ట్రై సిరీస్ కోసం బీసీసీఐ ఇండియా అండర్19-% ఏ, ఇండియా అండర్19 - బి జట్లను మంగళవారం (నవంబర్ 11) ప్రకటించింది. ఈ సిరీస్‌లో ఇండియా అండర్19%-% ఏ, ఇండియా అండర్19%-% బి జట్లతో పాటు అఫ్గానిస్తాన్ అండర్-19 మూడో జట్టుగా పాల్గొంటుంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఈ నెల 17 నుంచి 30 వరకు జరిగే ఈ ముక్కోణపు సిరీస్ జరుగుతుంది. జూనియర్ క్రికెట్‌లో దుమ్మురేపుతున్న హైదరాబాద్ యంగ్‌స్టర్ ఆరోన్ జార్జ్‌కు నేషనల్ టీమ్‌కు నాయకత్వం వహించే అరుదైన అవకాశం దక్కింది. ఇండియా అండర్19%-% బి జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ ట్రై సిరీస్ లో చెప్పుకోదగ్గ విషయం ఏంటంటే.. హైదరాబాద్ నుండి మరో క్రికెటర్ అండర్-19 ఇండియా ఏ టీంలోకి ఎంట్రీ ఇచ్చాడు. నాంపల్లి మల్లెపల్లికి చెందిన మహమ్మద్ మాలిక్ ను బీసీసీఐ అండర్-19 ఏ టీమ్ లో అవకాశం కల్పించింది. ఈ హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ ఇటీవలే జరిగిన అండర్- 19 వినూ మాంకడ్ ట్రోఫీలో టాప్ వికెట్ టేకర్ గా నిలిచి జట్టులో స్థానం సంపాదించాడు. మహమ్మద్ మాలిక్ భారత అండర్ 19 జట్టుకు ఎంపిక కావడంతో అతని తండ్రి మహ్మద్ అబ్దుల్ లక్డికపుల్ లో కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సెలెబ్రేశాం చేసుకున్నారు. ఇండియన్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ ప్రేరణతో ప్రాక్టీస్ చేసి, అండర్ 19 టీమ్ కు సెలెక్ట్ అయినట్లు మహమ్మద్ మాలిక్ తెలిపారు. ఈ నెల 17న బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్తాన్ తో జరగనున్న సిరీస్ లో పాల్గొననున్నట్లు మాలిక్ అన్నారు. భవిష్యత్తులో ఇండియన్ టీమ్ కు ప్రాతినిధ్యం వహించడం తన డ్రీమ్ అని.. ఆ దిశగా తాను మెరుగైన ప్రదర్శన ఇస్తానని మాలిక్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు చెందిన వికెట్ కీపర్ ఆర్.అలంకృత్, వాఫి కచ్చి ఇండియా%-%ఎ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ జట్టుకు విహాన్ మల్హోత్రా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.

**ఇండియా అండర్-19 A స్క్వాడ్:**
విహాన్ మల్హోత్రా ( కెప్టెన్), అభిజ్ఞాన్ కుందు (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), వాఫీ కచ్చి, వంశ్ ఆచార్య, వినీత్, లక్ష్య రాయ్చందనీ, రాపోల్ (వికెట్ కీపర్), కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, అన్మోల్జీత్ సింగ్, మహ్మద్ ఎనాన్, హెనిల్ పటేల్, అశుతోష్ మహీదా, ఆదిత్య రావత్, మహ్మద్ మాలిక్

**భారత U19 B స్క్వాడ్:**
ఆరోన్ జార్జ్ (కెప్టెన్), వేదాంత్ త్రివేది (వైస్ కెప్టెన్), యువరాజ్ గోహిల్, మౌల్యరాజ్‌సిన్హ్ చావ్డా, రాహుల్ కుమార్, హర్వాన్ష్ సింగ్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), RS అంబరీశ్, బీకే కిషోర్, పుష్పక్, హేమ్చుదేశన్, ఉదవ్ మోహన్, ఇషాన్ సూద్, దీపేష్, రోహిత్ కుమార్ దాస్ (CAB)

# రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్‌కు బిగ్ షాక్.. చిన్నస్వామిలో మ్యాచ్‌లు లేనట్టే.. కొత్త వేదిక ఎక్కడంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్ కు బిగ్ షాక్. 32000 సీటింగ్ కెపాసిటీ ఉన్న చిన్నస్వామి స్టేడియంలో ఇకపై క్రికెట్ ఆడే సూచనలు కనిపించడం లేదు. 2025 జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో విషాదం చోటు చేసుకోవడమే ఇందుకు కారణం. చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ విజయోత్సవ వేడుకల తర్వాత జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈ పరిణామం తర్వాత భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు రిపీట్ కాకుండా చూసేందుకు చర్యలు చేపట్టాలని కర్ణాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తమ హోమ్ మ్యాచ్ లు చిన్నస్వామి స్టేడియంలో ఆడే అవకాశాలు లేనట్టు వార్తలు వస్తున్నాయి. హోమ్ గ్రౌండ్ లో మ్యాచ్ లు లేకపోవడం ఏ జట్టుకైనా బ్యాడ్ న్యూస్. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆడబోయే తమ మ్యాచ్ లు పుణే వేదికగా పుణే గహుంజేలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసిఎ) స్టేడియంలో జరిగే అవకాశం ఉంది. ముంబై క్రికెట్ అసోసియేషన్ కమలేష్ పిసల్ మాట్లాడుతూ.. "పూణేలో ఆర్సీబీ మ్యాచ్ లకు ఆతిథ్యమివ్వడం ఇంకా చర్చల్లో ఉంది. ఈ విషయం ఇంకా ధృవీకరించబడలేదు. తొక్కిసలాట కారణంగా కర్ణాటకలో సమస్య ఉంది. వారు వేరే వేదిక కోసం చూస్తున్నారు. మేము మా స్టేడియంలో మ్యాచ్ లు ఆడుకోమని ఆఫర్ ఇచ్చాము". అని ముంబై క్రికెట్ అధికారి ఒకరు అన్నారు. ఇటీవలే జరిగిన మహిళల వరల్డ్ కప్ మ్యాచ్ లు కూడా చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించలేదు. ఈ స్టేడియంలో జరగాల్సిన ఐదు మ్యాచ్‌లను నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంకు తరలించారు. చిన్నస్వామి ఈ స్టేడియాన్ని



మరపిస్తూ బెంగళూరులో అతి పెద్ద క్రికెట్ స్టేడియాన్ని నిర్మించబోతున్నారు. భవిష్యత్తులో బెంగళూరు నగరంలో కొత్త క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుంది. ఈ స్టేడియం సూర్య సిటీ, బొమ్మసంద్రలో ఉంటుంది. స్టేడియం సీటింగ్ కెపాసిటీ 80,000 కావడం విశేషం. ఇండియాలోనే రెండో అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా మారనుంది.ఎం.చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట తర్వాత బెంగళూరు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బొమ్మసంద్రలోని సూర్య సిటీలో రూ.1,650 కోట్లతో మెగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆమోదించారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం తర్వాత ఇండియాలో ఇదే అతి పెద్ద స్టేడియంగా మారనుంది. చిన్నస్వామి స్టేడియం కెపాసిటీ 32,000 కాగా.. 17 ఎకరాల్లో విస్తరించి ఉంది.

# కోహ్లీకి కలిసొచ్చిన బాబర్ ఫెయిల్యూర్.. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-5లోకి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో టాప్-5 లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన తొలి రెండు వన్డేల్లో డకౌటైన విరాట్.. టాప్-5లో చోటు కోల్పోయి ఆరో స్థానానికి పడిపోయాడు. పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలోకి విఫలం కావడం విరాట్ కు కలిసొచ్చింది. బుధవారం (నవంబర్ 12) ఐసీసీ ప్రకటించిన లేటెస్ట్ ర్యాంకింగ్స్ లో ఒక స్థానం ఎగబాకి కోహ్లీ ఐదో స్థానంలో నిలిచాడు. మరోవైపు బాబర్ అజామ్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్ కు పడిపోయాడు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో అగ్ర స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఆస్ట్రేలియా పై ఇటీవలే జరిగిన వన్డే సిరీస్ లో సత్తా చాటిన రోహిత్.. 38 ఏళ్ళ వయసులో వన్డేల్లో నెంబర్ ర్యాంక్ కు చేరుకొని చరిత్ర సృష్టించాడు. ఈ సిరీస్ కు ముందు మూడో స్థానంలో ఉన్న హిట్ మ్యాన్.. రెండు స్థానాలు ఎగబాకి నెంబర్ స్థానానికి చేరుకోవడం విశేషం. అంతేకాదు వన్డేల్లో అతి పెద్ద వయసులో నెంబర్ ర్యాంక్ అందుకున్న ప్లేయర్ గా రికార్డులకెక్కాడు. సహచర ప్లేయర్ శుభమాన్ గిల్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రేయాస్ అయ్యర్ ఒక స్థానం మెరుగుపర్చుకొని తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో అద్భుతంగా రాణించిన డారిల్ మిచెల్ మూడో స్థానంలో నిలిచాడు. శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంక ఒక స్థానం ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. ఐర్లాండ్ బ్యాటర్ హ్యారీ టెక్టార్ 8 స్థానంలో ఉండగా.. వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ 10 స్థానంలో నిలిచాడు. పాకిస్థాన్ ఓపెనర్ సైన్ అయూబ్ ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 36 వ స్థానికి చేరుకోవడం విశేషం.



రెజీనా కసాండ్రా యొక్క తాజా ఫోటోషూట్ 'లిల్లీ విల్లీ' చుట్టూ సందడి చేస్తుంది

# ఇకపై ప్రభాస్ ఫోకస్ మొత్తం ఆ రెండింటి పైనే!



తెలుగు సినిమా ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నేపథ్యంలో ప్రతీ సినిమా పూర్తవడానికి చాలానే కాలం పడుతుంది. క్యాస్టింగ్ నుంచి విజువల్స్ వరకు, వీఎఫ్ఎక్స్ నుంచి ఎడిటింగ్ వరకు అన్నీ టాప్ గా ఉండాలని ప్రతీ విషయంలో జాగ్రత్త తీసుకోవడంతో భారీ బడ్జెట్ సినిమాలన్నీ బాగా ఆలస్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే స్టార్ హీరోలు ఒక్కో సినిమా చేయడానికి సుమారు రెండేళ్లు తీసుకుంటున్నారు .

### పలుసార్లు వాయిదా పడ్డ రాజా సాబ్

కానీ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం త్వరత్వరగా సినిమాలను పూర్తి చేస్తూ వస్తున్నారు. కనీసం సంవత్సరానికి ఒక సినిమా అయినా రిలీజయ్యేట్టు చూసుకుంటున్నారు ప్రభాస్. గతేడాది కల్కి సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించిన ప్రభాస్, ఈ ఇయర్ రాజా సాబ్ ను ఆడియన్స్ ముందుకు తీసుకొద్దామనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల మధ్యలో షూటింగ్ లేటవడంతో రాజా సాబ్ వాయిదా పడింది.

### సంక్రాంతి కానుకగా రానున్న రాజా సాబ్

పలు వాయిదాలు పడ్డ తర్వాత రాజా సాబ్ ను డిసెంబర్ లో రిలీజ్ చేద్దామని మేకర్స్ భావించారు. కానీ భారీ సినిమా కావడంతో సంక్రాంతి సీజన్ అయితే ఈ సినిమా ఎక్కువ మంది ఆడియన్స్ కు రీచ్ అవడంతో పాటూ మంచి కలెక్షన్లు వస్తాయని భావించి సినిమాను జనవరి 9న రిలీజ్ చేయాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. ఇదిలా ఉంటే తాజాగా రాజా సాబ్ కు సంబంధించి ప్రభాస్ పోర్షన్ షూటింగ్ పూర్తైందని తెలుస్తోంది.

### రాజా సాబ్ ను పూర్తి చేసేసిన డార్లింగ్

ఇప్పటివరకు ఓ వైపు మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ ను, మరోవైపు హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ సినిమాలను చేస్తున్న ప్రభాస్, త్వరలోనే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ ను మొదలుపెట్టి ఫౌజీ మరియు స్పిరిట్ సినిమాలను ఒకేసారి చేయనున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ ఫౌజీ ఎప్పుడో మొదలవడంతో ఆ సినిమా త్వరగానే పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫౌజీని పూర్తి చేశాక ప్రభాస్ తన ఫోకస్ మొత్తాన్ని స్పిరిట్ పైనే పెట్టనున్నారని సమాచారం. స్పిరిట్ తర్వాత కల్కి2, సలార్2 సినిమాలను చేయనున్నారు ప్రభాస్.



రుక్మిణి వసంత్ శైలి అంతిమ లక్ష్యం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com